ఈనాడు
శ్రీ సత్యసాయి



జగజ్జననీ.. నమోస్తుతే

జిల్లాలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. హిందూపురం, పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, పెనుకొండ నియోజకవర్గాల్లో అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించారు. ధర్మవరం పట్టణంలోని గాయత్రీమాత ఆలయంలో అమ్మవారు బ్రహ్మచారిణి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. **- న్యూస్‌టుడే, ధర్మవరం**

ధర్మవరంలో బ్రహ్మచారిణి అలంకారంలో గాయత్రిదేవి

టెట్‌కు 2038 మంది హాజరు



అనంతపురం: ఎన్‌సీసీఎస్‌ఏఐ పరీక్ష కేంద్రం వద్ద హాల్‌టికెట్లు, గదుల వివరాలు పరిశీలిస్తున్న అభ్యర్థులు

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) గురువారం ఆరంభమయ్యింది. ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో పరీక్షలు నిర్వహించారు. మొదటి రోజు ఉదయం 8 కేంద్రాలు, మధ్యాహ్నం 7 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. అనంతపురం, తాడిపత్రి, గుత్తి, బెంగళూరులో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 1,235 మందికి 1,075 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం 1,070 మందికి 963 మంది హాజరయ్యారు. మొత్తం 2,305 మందికి 2,038 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ నెల 21 వరకూ టెట్ పరీక్షలు జరగనున్నాయి.

చెత్త పన్నుపై ఉపశమనం..
పురవాసులపై తప్పిన ఆర్థిక భారం

- ఉమ్మడి అనంత జిల్లాలో నెలకు రూ.1.11 కోట్లు వసూలు
- ప్రభుత్వమే క్లాప్ నిర్వహణ

ఈనాడు, పుట్టపర్తి –న్యూస్‌టుడే, అనంత నగరపాలక

పట్టణవాసులకు గుదిబండలా మారిన చెత్తపన్నును రద్దు చేస్తూ తెదేపా కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటూ ఈనెల 2న గాంధీ జయంతిని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన చేశారు. వెంటనే అమల్లోకి తీసుకురావడంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పురపాలక వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు వైకాపా ప్రభుత్వంలో చెత్తపన్ను వసూళ్లలో లక్ష్యాలు పూర్తిచేయలేక ఇబ్బందులు ఎదుర్కొన్న వార్డు సచివాలయాల సిబ్బంది సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు. జగన్ పాలనలో నోటీసులు అందుకున్న శానిటేషన్ కార్యదర్శులు ఊపిరి పీల్చుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో అనంతపురం, హిందూపురం, కదిరి, ధర్మవరం, గుంతకల్లు పరిధిలోని ప్రజలకు తాజా ప్రకటన ఊరటనిస్తోంది.

ఇక పురపాలిక నిధులతోనే..

గత ప్రభుత్వంలో ఐదు పురపాలికల పరిధిలో మొత్తం 155 చెత్త వాహనాలను అందించింది. వాటి ద్వారా నిత్యం తడి, పొడిచెత్త వేర్వేరుగా సేకరించాల్సి ఉన్నా... సక్రమంగా అమలు చేయలేదు. ప్రైవేటు ఏజెన్సీ నిర్లక్ష్యంతో రహదారులపైన చెత్త పేరుకుపోయేది. అయినా ముక్కుపిండి పట్టణవాసుల నుంచి పన్ను వసూలు చేశారు. తెదేపా కూటమి ప్రభుత్వం పట్టణవాసులపై భారం పడకుండా పురపాలిక సాధారణ నిధులతోనే చెత్తసేకరణ చేయనుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చెత్తపన్ను రద్దు చేసి పట్టణవాసులకు ఉపశమనం కలిగించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

గత వైకాపా ప్రభుత్వంలో చెత్త పన్ను వసూళ్లు ఇలా..

పురపాలిక/ కార్పొరేషన్	గృహాలు	చెత్త వాహనాలు	పన్ను (రూ.ల్లో)
అనంతపురం	69,357	60	40,75,680
గుంతకల్లు	31,045	30	24,97,680
హిందూపురం	39,678	25	21,17,740
ధర్మవరం	32,914	25	20,99,540
కదిరి	21,639	15	11,25,280



అనంతపురం: ఇంటింటా చెత్త సేకరణ

రూ.60 నుంచి రూ.10 వేల దాకా..

క్లాప్ (క్లీన్ ఆంధ్రప్రదేశ్) అమలులో భాగంగా వైకాపా ప్రభుత్వం చెత్తపన్ను తీసుకొచ్చింది. అనంతపురం నగరపాలకతో పాటు హిందూపురం, కదిరి, ధర్మవరం, గుంతకల్లు మున్సిపాలిటీల్లో చెత్తసేకరణ బాధ్యతను ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించారు. ఇందుకుగాను వినియోగదారుల రుసుం కింద గృహ సముదాయాల నుంచి పన్ను వసూలు చేశారు. పేదల ఇళ్ల నుంచి నెలకు రూ.60, మధ్య తరగతి వారి నుంచి రూ.90 తీసుకునేవారు. వాణిజ్యసముదాయాలు, క్లినిక్‌లు, కళ్యాణమండపాలు, హోటళ్ల నుంచి రూ.150 నుంచి రూ.10 వేలు వసూలు చేసేవారు. ఐదు పురపాలికల్లో కలిపి నెలకు రూ.1.11 కోట్లు వసూలు చేయాలని జగన్ ప్రభుత్వం లక్ష్యాలు విధించింది. అందరి నుంచి వసూలు చేయాల్సిందేనని వార్డు సచివాలయ సిబ్బందిని ఆదేశించింది. లక్ష్యం చేరని వారికి నోటీసులు జారీ చేసేవారు. గుంతకల్లు, ధర్మవరం, అనంతపురం పరిధిలో చెత్తపన్ను చెల్లించని వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిలిపివేస్తామని హెచ్చరించారు. కొందరికి పింఛన్ల సొమ్ము నుంచి చెత్తపన్నును మినహాయించుకునేవారు. దీంతో గత ప్రభుత్వంలో పట్టణాల్లోని పేదలు పన్ను కట్టలేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం పన్నును పూర్తిగా రద్దు చేయడంతో ఉపశమనం కలిగింది.

జిల్లాలో కుండపోత వర్షం



ఉద్ధృతంగా ప్రవహిస్తున్న చందమూరు వంక

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా బుధవారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. అత్యధికంగా చెన్నేకొత్తపల్లి 82.4 మి.మీ., అత్యల్పంగా గాండ్లపెంట 3.6 మిమీ వర్షపాతం నమోదైంది. పుట్టపర్తి 72.4 మి.మీ., లేపాక్షి 60.2, రొద్దం 59.6, హిందూపురం 54.6, కొత్తచెరువు 47.0, చిలమత్తూరు 46.8, పరిగి 40.6, సోమందేపల్లి 40.4, నల్లమాడ 38.6, బుక్కపట్నం 34.2, మడకశిర 34.0, గోరంట్ల 31.2, తలుపుల 30.4, అగళి 23.4, కనగానపల్లి 22.4, తనకల్లు 18.2, ఎన్‌పీకుంట 17.2, ముదిగుబ్బ 15.4, ఓడీసీ 15.4, పెనుకొండ 13.2, ధర్మవరం 12.4, రొళ్ల 12.2, నల్లచెరువు 11.8, తాడిమర్రి 9.0, రామగిరి 8.4, కదిరి 6.6, గుడిబండ 6.0, అమడగూరు 5.2 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు జిల్లా ప్రణాళికాధికారి విజయ్‌కుమార్ తెలిపారు.

గాలీవాన బీభత్సం

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: చెన్నేకొత్తపల్లి పరిసరాలలో బుధవారం రాత్రి గాలి, వడగండ్లవాన బీభత్సం సృష్టించింది. ఏడాది ఖరీఫ్ ఆరంభం నుంచి ఎన్నడూ లేని విధంగా కుంభవృష్టి కురిసింది. రాత్రి 9 గంటలకు చినుకులతో ప్రారంభమైన ఏకధాటిగా గంటన్నర సేపు వడగండ్లవాన కురిసింది. రాత్రి 11 గంటలకు మరోసారి ప్రారంభమైన వాన 2.30 గంటల వరకు ఎడతెరిపి లేకుండా కురిసింది. వాగులు, వంకలు ఉప్పొంగాయి. వడగండ్ల వాన బీభత్సానికి 44 జాతీయ రహదారి పక్కన ఉన్న దుకాణ షెడ్లు దాదాపు 150 మీటర్ల దూరం ఎగిరిపోయి పొలాల్లో పడ్డాయి. ఆ సమయంలో రహదారిపై వాహన రాకపోకలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. బాధితులు ఆంజనేయులు కిరాణా దుకాణంలోని సామగ్రి, షెడ్డుతో కలిపి రూ.70 వేలు, మరో బాధితుడు రాధాకృష్ణ నిర్మాణంలో ఉన్న దుకాణం ఎగిరిపోవడంతో రూ.40 వేల నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన 8 మంది రైతులకు చెందిన 20 ఎకరాల్లోని టమాటా, గోరుచిక్కుడు కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. ఊరకొండ సమీపంలో పలు నియంత్రికలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ముష్ఠికోవెల చెరువు హంద్రీనీవా జలాలతోపాటు రాత్రి కురిసిన వర్షానికి పూర్తిస్థాయిలో నిండి మరువ పారింది.



చెన్నేకొత్తపల్లి: నేలకొరిగిన విద్యుత్తు నియంత్రిక

నేడు స్వర్ణాంధ్ర-2047 విజన్‌పై సమీక్ష

పుట్టపర్తి, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర-2047 విజన్ సమావేశం కలెక్టర్ టీఎస్ చేతన్ అధ్యక్షతన శుక్రవారం ఉదయం 10.30కు సాయిఆరామంలో జరగనుంది. జిల్లా, నియోజకవర్గాల్లో ఐదేళ్లపాటు చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించనున్నారు. మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు సమావేశానికి హాజరుకానున్నారు.

పైప్‌లైన్‌తో గ్యాస్ సరఫరా ప్రారంభం



పైప్‌లైన్‌ను ప్రారంభిస్తున్న రత్నాకర్

పుట్టపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: సీఎన్‌జీ పైప్ లైన్ గ్యాస్ సరఫరాతో భావితరాలకు అనుకూల పర్యావరణ భవిష్యత్తును అందించవచ్చని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు రత్నాకర్ అన్నారు. గురువారం కప్పలబండ పారిశ్రామికవాడలో ఏజీ పి-ప్రథమ్ సంస్థ ఆధ్వర్యంలో గ్యాస్(సీఎన్‌జీ) సరఫరా, ఫిల్లింగ్ కేంద్రం ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రత్యేకమైన సీఎన్‌జీతో కూడిన డీసీయు స్టేషన్ అందుబాటులోకి రావడంతో సమాజానికి స్వచ్ఛ ఇందనం అందించి, నూతన యుగంలోకి అడుగిడుతున్నట్లు చెప్పారు. జిల్లా ఎస్పీ రత్న మాట్లాడుతూ ఇంధన వినియోగం ద్వారా బహుళ ప్రయోజనాలు ఉన్నాయన్నారు. హరిత ఇంధన వనరులను ఎంచుకోవడం ద్వారా కర్బన ఉద్గారాలను తగ్గించవచ్చని, రవాణా నెట్‌వర్క్ మెరుగుపడుతుందన్నారు. సంస్థ డిప్యూటీ రీజినల్ హెడ్ చిరాగ్‌పటేల్ మాట్లాడుతూ దేశంలో హరిత గృహాలు, పర్యావరణ అనుకూల పరిస్థితుల స్థాపనకు కట్టుబడి ఉన్నామన్నారు. కేంద్రం చుట్టూ 24 కి.మీ పరిధిలోని ప్రాంతాలకు సేవలు విస్తరిస్తామన్నారు. ప్రస్తుతం తేలికపాటి అన్ని రకాల వాహనాలకు గ్యాస్ అందుబాటులో ఉంచామన్నారు. సంస్థ ప్రతినిధులు చీరదత్, సుశీల్‌జాద్ పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా చేసుకోవాలి: ఎస్పీ

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: దేవీ నవరాత్రులను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ రత్న విజ్ఞప్తి చేశారు. పండుగ పూర్తయ్యే వరకు డీజేలు, నృత్యాలు, ఊరేగింపులు, బాణసంచా కాల్చడం నిషేధమన్నారు. 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని, ఎవరైనా అతిక్రమిస్తే చట్టరీత్యా శిక్షిస్తామని ఎస్పీ హెచ్చరించారు.

ప్రభుత్వ ప్రయోజనాలు త్వరగా అందేలా చూస్తాం

విధి నిర్వహణలో మృతిచెందిన పోలీసుల కుటుంబాలకు, పదవీ విరమణ పొందిన వారికి ప్రయోజనాలు, బకాయిలు త్వరగా అందేలా చూడాలని ఎస్పీ రత్న జిల్లా పోలీసు కార్యాలయ(డీపీఓ) సిబ్బంది, సంఘం సభ్యులకు సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం పోలీసుల కుటుంబాలతో నిర్వహించిన సమావేశంలో ఎస్పీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారి సమస్యలు తెలుసుకున్నారు. డీపీఓల విధులు, పోలీస్ ఫండ్ సంక్షేమం గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో ఏఓ సుజాత, సూపరింటెండెంట్ సరస్వతి, మల్లికార్జున, సీసీలు రాఘవేంద్ర, ఆనంద్, పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు సూర్యకుమార్, ఏఆర్ ఎస్సై షౌకత్‌అలి పాల్గొన్నారు.

శ్రీసత్యసాయి విద్యుత్తుశాఖ సర్కిల్ ఏర్పాటుకు శ్రీకారం
అధికారులను కేటాయిస్తూ ఉత్తర్వులు

అనంతపురం (విద్యుత్తు), న్యూస్‌టుడే: ఇప్పటి వరకు ఉమ్మడి అనంతపురం జిల్లాకు విద్యుత్తుశాఖ సర్కిల్ ఉండేది. వినియోగదారులకు మెరుగైన విద్యుత్తు సేవలు అందించాలని సర్కిల్‌ను రెండుగా విభజించింది. ఇందులో భాగంగా శ్రీసత్యసాయి జిల్లా సర్కిల్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈక్రమంలో అనంత సర్కిల్‌కు 58 మంది, సత్యసాయికి 55 మంది అధికారులను కేటాయించారు. ఈనెల 2లోపు విభజన ప్రక్రియ పూర్తి చేసి కార్యాలయం ప్రారంభించాలని ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు ఆదేశాలు జారీ చేశారు. కాగా కార్యాలయ భవనాన్ని గుర్తించలేదు. కొత్తగా పోస్టులు కేటాయించకుండా ఉన్న వారినే నూతన సర్కిల్‌కు సర్దుబాటు చేయటంతో ఉద్యోగ సంఘాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ఎస్ఈ, డీఈటీ, ఎస్ఏఓ, ఏఓ పోస్టులనే నూతనంగా ఎస్పీడీసీఎల్ నుంచి కేటాయించారు. ఈఈ, డీఈఈ, ఏఈ, ఏఏఓ పోస్టులను అనంత సర్కిల్ నుంచి సత్యసాయి సర్కిల్‌కు సర్దుబాటు చేశారు.

ప్రాంతాలు ఇలా..


శ్రీసత్యసాయి విద్యుత్తుశాఖ సర్కిల్ కార్యాలయాన్ని జిల్లా కేంద్రం పుట్టపర్తిలో ఏర్పాటు చేయాల్సి ఉంది. దీని పరిధిలో కదిరి, హిందూపురం ఉండగా ప్రస్తుతం అనంతపురం రూరల్ డివిజన్‌ను కొత్త సర్కిల్‌లోకి కలపటంతో పాటు పుట్టపర్తి కేంద్రంగా డివిజన్‌ను ఏర్పాటు చేయాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. బత్తలపల్లి, తాడిమర్రి మండలాలను రూరల్ డివిజన్‌లోకి మార్పు చేయనున్నారు.

ఉద్యోగ సంఘాల వినతులు

ఉన్నఫళంగా నూతన సర్కిల్‌ను ఏర్పాటు చేసి బదిలీలు చేపడితే ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఉద్యోగ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అధికారులు, ఉద్యోగులు నష్టపోకుండా ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి... వారి సూచనల మేరకు విభజన ప్రక్రియ చేపట్టాలని సంఘాల నేతలు ఎస్పీడీసీఎల్ సీఎండీని కలిసి వినతిపత్రాలను అందజేశారు. ఈ మేరకు తెలుగునాడు విద్యుత్తు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, వెంకటేశ్ గురువారం విద్యుత్తుశాఖ ఎస్ఈని కలిసి విన్నవించారు.

రూ.కోటి వ్యయం.. నాణ్యత ప్రశ్నార్థకం
పెచ్చులూడిన తరగతి గది పైకప్పు

తాడిమర్రి, న్యూస్‌టుడే: తాడిమర్రి ఉన్నత పాఠశాలలో తరగతి గది పైకప్పు పెచ్చులూడుతోంది. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి గది పైభాగాంలో పూర్తిగా నీరు నిలబడ్డాయి. దాంతో పైకప్పు తడిసి సిమెంట్ పెళ్లలు ఊడిపడ్డాయి. ఈ గదిలో కాపలాదారు రమణ నిద్రపోతున్న సమయంలో ఒక్కసారిగా పెద్ద శబ్దంతో సిమెంట్ పెళ్లలు ఊడిపడ్డాయి. అతను భయపడి బయటకు పరుగులు తీశారు. దసరా సెలవులు కావడంతో విద్యార్థులకు పెను ప్రమాదం తప్పిందని తల్లిదండ్రులు పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలలో రూ.కోటి ఖర్చు చేసి తరగతి గదులకు మరమ్మతులు చేయించారు. పనులు నాసిరకంగా ఉండటంతో ఏడాది గడవకముందే పైకప్పులు పెచ్చులూడుతున్నాయి. సంబంధిత శాఖాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనులు నాసిరకంగా చేయించారనే ఆరోపణలు ఉన్నాయి. చిన్నపాటి వర్షానికే ఇలా ఉంటే.. భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి ఏంటనీ విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. పాఠశాల పున:ప్రారంభం కాకముందే గదులకు మరమ్మతులు చేయించాలని వారు కోరుతున్నారు.



తరగతి గదిలో పెచ్చులూడిన పైకప్పు

గ్రూపు-4 క్రీడా కోటాపై పరిశీలన

- ఇద్దరు అభ్యర్థులు గైర్హాజరు
- 'ఈనాడు' కథనంతో కదలిక

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ఎట్టకేలకు ఏపీపీఎస్సీ గ్రూపు-4 క్రీడా కోటా వ్యవహారంలో కదలిక వచ్చింది. నిర్దేశిత ధ్రువీకరణ పత్రాల దాఖలు, పరిశీలన కోసం మొత్తం 15 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా.. ఇద్దరు గైర్హాజరయ్యారు. తక్కిన 13 మంది వచ్చి విద్యార్హత, క్రీడల ధ్రువీకరణ పత్రాలను సమర్పించారు. గురువారం కలెక్టరేట్ ఎ సెక్షన్‌కు వచ్చి సంబంధిత అధికారులకు అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ క్రీడా కోటా కింద ఉన్న ఒక పోస్టు భర్తీలో తీవ్ర జాప్యం జరగడం, ఈ బాగోతంలో అనేక మలుపులు తిరగడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే వ్యవహారంపై ఈనెల 2న 'ఒక్క పోస్టు... మలుపులెన్నో!' అన్న కథనాన్ని 'ఈనాడు' ప్రచురించింది. ఇది అధికార వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. ప్రభుత్వ జీవో, మార్గదర్శకాలకు విరుద్ధంగా కొన్ని తతంగాలు గుట్టుచప్పుడు కాకుండా చోటు చేసుకోవడం విశేషం. ప్రభుత్వ జీవో 74 ప్రకారం క్రీడా కోటా కింద అర్హత సాధించిన వారికి రాత పరీక్షలో కనీసం 40 శాతం మార్కులు రావాలి. అంటే.. 300 మార్కుల్లో కనీసం 120 మార్కులు తప్పనిసరి. తాజాగా హాజరైన 13 మందిలో... ఏడుగురికి కనీస మార్కులు లేనట్లు తెలుస్తోంది. కనీస మార్కుల కంటే తక్కువ వచ్చిన వారి పత్రాలను శాప్‌కు పంపకూడదు. ఇలా అనేక లోపాలు, పొరపాట్లను పూర్తి స్థాయిలో పరిశీలన చేసిన తర్వాతే అర్హత కల్గిన వారి జాబితాను శాప్‌కు పంపనున్నారు.

తాత్కాలికంగా ఆర్టీసీ బస్సు పాసుల జారీ నిలిపివేత

అనంతపురం ఆర్టీసీ: అనంతపురం ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో విద్యార్థులతో పాటు అన్ని రకాల బస్సు పాసులు తాత్కాలికంగా నిలిపివేశామని డిపో మేనేజరు నాగభూపాల్ తెలిపారు. సాఫ్ట్‌వేర్ ఆధునికీరణ చేస్తుండటంతో www.apsrtcpass.in ఈ నెల 5, 6 వతేదీల్లో నిలిపివేశారు. 7 నుంచి యథాతథంగా బస్‌పాసులు కౌంటర్ల వద్ద ఇవ్వనున్నామన్నారు. విద్యార్థులు, ప్రయాణికులు సహకరించాలని కోరారు.

చిత్రం.. సమాజ సందేశం

ఆదర్శంగా విశ్రాంత రైల్వే ఉద్యోగి


ఆంజనేయస్వామి చిత్రాన్ని వేస్తున్న శ్రీధరన్

గుంతకల్లు, న్యూస్‌టుడే : గుంతకల్లుకు చెందిన విశ్రాంత రైల్వే ఉద్యోగి శ్రీధరన్ చిత్రలేఖనంలో రాణిస్తున్నారు. ఏటా వేసవిలో బాల బాలికలకు చిత్రలేఖనంపై ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేస్తూ కళను పది మందికి పంచుతున్నారు. 15 ఏళ్లుగా నిర్విఘ్నంగా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. జల, వాయు కాలుష్యం, మొక్కల పెంపకం, మట్టి విగ్రహాలు, బాల్య వివాహాలు, వయోజన విద్య, నీటిని పొదుపు, వంటి అంశాలను తీసుకొని కుంచెతో చిత్రాలు వేస్తూ సమాజాన్ని మేలుకొలుపుతుంటారు.

గిన్నిస్ బుక్ ప్రశంసలు

2022 ఏప్రిల్‌లో గిన్నిస్ బుక్ నిర్వాహకులు ఆన్‌లైన్‌లో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఆ పోటీల్లో పాల్గొని ఆంజనేయస్వామి చిత్రాన్ని వేశారు. ఈ మేరకు నిర్వాహకుల నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. మరో పోటీలో లండన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ నుంచి 2024 జులైలో ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. రాష్ట్రంలోనే కాకుండా దేశంలోని వివిధ సంస్థలు నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో పాల్గొని బహుమతులు, పతకాలు సాధించారు.


ప్రశంసాపత్రం

కళను పది మందికి పంచుతున్నా..

బాల్యం నుంచి చిత్రాలు గీయడమంటే ఇష్టం. ఈ కళను శిబిరాల ద్వారా పది మందికి పంచుతున్నా. సామాజిక అంశాలను తీసుకొని చిత్రాలు వేయడం అలవాటు చేసుకున్నా. **- శ్రీధరన్, చిత్రకారుడు**

ఉద్యాన పంటలు.. రాబడి మార్గాలు

సాగుపై అన్నదాతల మొగ్గు

గుమ్మఘట్ట, కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే : మారుతున్న కాలంతో పాటు అన్నదాతల ఆలోచనల్లోనూ మార్పులొస్తున్నాయి. సాధారణ పంటల సాగు కన్నా ఉద్యాన పంటలతో ఎక్కువ లాభాలు గడించొచ్చనే ఉద్దేశంతో రైతులు మొగ్గు చూపుతున్నారు. కూటమి ప్రభుత్వం రైతుల ఆలోచనలకు అనుగుణంగా రాయితీతో సాగును ప్రోత్సహిస్తోంది. ఉపాధి పథకం ద్వారా రైతులకు తోడ్పాటును కల్పిస్తోంది. మొత్తం 16 రకాల మొక్కలు మామిడి, దానిమ్మ, జామ, సపోటా, చీనీ, డ్రాగన్ ఫ్రూట్స్, అల్లనేరేడు, చింత, టెంకాయ, తైవాన్ జామ లాంటి పండ్ల రకాలను రైతులకు అందించి ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.

ఇప్పటివరకు నాటిన మొక్కల వివరాలు

మండలం	రైతుల వివరాలు	సాగు (ఎకరాల్లో)
గుమ్మఘట్ట	52	172.00
రాయదుర్గం	49	152.26
బొమ్మనహాళ్	18	39.66
డి.హీరేహాళ్	49	131.00
కణేకల్	12	31.60


కళ్యాణదుర్గం : హులికల్లులో మొక్కలు నాటుతున్న రైతులు

● రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లోనే దాదాపుగా 3940.52 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేశారు. రికార్డు స్థాయిలో కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కంబదూరు మండలంలో మొత్తం 1016.45 ఎకరాల్లో 267 మంది రైతన్నలు పండ్ల మొక్కలు నాటారు.

● హార్టికల్చర్ హబ్‌గా పేరున్న కళ్యాణదుర్గం ప్రాంతంలో మొత్తం 1037 మంది రైతులు 3463.72 ఎకరాల్లో రికార్డు స్థాయిలో పండ్ల మొక్కలు నాటారు.

మూడేళ్ల పాటు ప్రభుత్వ ప్రోత్సాహం

మామిడి మొక్కలు రైతు నాటుకుంటే ప్రతి ఎకరాకు 70 మొక్కలు ఉచితంగా అందిస్తారు. గుంతలు తవ్వకునేందుకు రూ.16 వేలు, మొక్కలు నాటేందుకు రూ.1,100, ప్రతినెలా మూడు సార్లు నీరు పోసేందుకు రూ.1260లు మూడేళ్ల పాటు ఇస్తారు.

ఎమ్మెల్యే సురేంద్రబాబుకు పురస్కారం


పురస్కారం అందుకుంటున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు అరుదైన గౌరవం దక్కింది. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని ఎన్నారై వెల్ఫేర్ సొసైటీ వారిచే గ్లోబల్ ఇండియన్స్‌కి అందించే ప్రతిష్ఠాత్మకమైన మహాత్మాగాంధీ లీడర్‌షిప్ అవార్డును కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, యూకేలోని ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ మ్యూజియంలో అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు నియోజకవర్గ ప్రతినిధులు అభినందనలు తెలియజేశారు. ఆయన వెంట మిత్రుడు దేవినేని రాజగోపాల్ ఉన్నారు.

బీసీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట : ఎంపీ

పరిగి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం బీసీల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని హిందూపురం పార్లమెంట్ సభ్యుడు బీకే పార్థసారథి పేర్కొన్నారు. గురువారం పరిగిలో ఎంపీ నిధులు రూ.కోటితో చేపట్టనున్న వాల్మీకి కల్యాణ మండపానికి ఎంపీ బీకే పార్థసారథి భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ శ్రేయస్సు కోసం కష్టపడిన కార్యకర్తలకు అండగా ఉంటానని తెలిపారు. వ్యక్తులకన్నా పార్టీ గొప్పదన్నారు. పార్టీని కాపాడు కోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. సీఎస్ఆర్ గ్రాంటు ద్వారా నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి సాధికార కమిటీ సభ్యులు ఈశ్వరప్ప, పరిగి సంఘం అధ్యక్షుడు కేడీ కిష్టప్ప, ట్రెజరర్ శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి సోము, న్యాయవాది శివశంకర్, చంద్ర, రొద్దం మండలం నరహరి, అనిల్‌కుమార్, నరసింహులు, కన్నప్ప, సురేష్, రాజు, మూర్తి, తెలుగు మహిళలు, వాల్మీకి సోదరులు పాల్గొన్నారు.


భూమి పూజ చేస్తున్న ఎంపీ బీకే పార్థసారథి

సాళువ పాలకులు చాళుక్య వంశవారసులే..

గోరంట్ల, న్యూస్‌టుడే: విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన రెండో రాజ వంశం సాళువ పాలకులు చాళుక్య వంశ వారసులని చరిత్రకారుడు మైనాస్వామి పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మాధవరాయ ఆలయ ముందుభాగంలో ఉన్న రాతిపలక శాసనాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాధవరాయస్వామి సేవలకు భూదానం ఇస్తూ శాసనాన్ని సాళువ నరసింగరాయలు రాయించినట్లు వెల్లడించారు. వారు చాళుక్యవంశ వారసులుగా శాసనంలో పేర్కొన్నారన్నారు. తొలుత చంద్రగిరి, అనంతరం పెనుకొండ సీమరాజ ప్రతినిధిగా పనిచేసిన సాళువ 1485 నుంచి 1491 వరకు విజయనగర సామ్రాజ్య చక్రవర్తిగా పాలించినట్లు చెప్పారు. సంస్కృత శాసనాన్ని సుందరమైన తెలుగులో రాశారన్నారు. శాసనం పైభాగంలో సుదర్శన చక్రం, సూర్యుడు, చంద్రుడు, శంకు బొమ్మలు ఉన్నాయన్నారు. సాళువ నరసింగరాయలను చాళుక్య వంశ వారసులుగా వివరిస్తున్న ఏకైక శాసనం ఇదేనని, రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.


సాళువ చరిత్రను వివరిస్తున్న మైనాస్వామి



అగళి చెరువుకు సువర్ణముఖి నీరు

కర్ణాటకలో ఎగువ సిద్దరకొండ పరిసరాల్లో వర్షాలు భారీగా కురవడంతో సువర్ణముఖి నది ఉప్పొంగి ప్రవహించింది. గురువారం నదీ జలాలు కర్ణాటకలోని సజ్జేహొసహళ్లి నుంచి బైపాస్ కాలువ ద్వారా అగళి చెరువుకు చేరుతున్నాయి. **-న్యూస్‌టుడే, అగళి**

గుంతకల్లు మీదుగా వారంలో రెండు రైళ్లు

గుంతకల్లు, న్యూస్‌టుడే : గుంతకల్లు మీదుగా వారంలో రెండు సార్లు రెగ్యులర్‌గా ప్రయాణించే రైళ్ల రాకపోకలు ఈనెల 9 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ రైళ్లు సికింద్రాబాదు నుంచి గుంతకల్లు మీదుగా గోవాకు వెళ్తాయని డివిజన్ అధికారులు గురువారం ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాదులో ప్రతి బుధ, శుక్రవారాల్లో, గోవా నుంచి గురు, శనివారాల్లో రైళ్లు బయలు దేరనున్నాయి. సికింద్రాబాదులో రైలు (17039) ఉదయం 10.05కు బయలుదేరి డోన్‌కు మధ్యాహ్నం 3.25, గుంతకల్లుకు సాయంత్రం 5.05 గంటలకు వచ్చి, గోవాకు తెల్లవారు జామున 5.45కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో రైలు (17040) గోవాలో ఉదయం 9 గంటలకు బయలుదేరి గుంతకల్లుకు రాత్రి 8.55, డోన్‌కు 10.50కు వచ్చి సికింద్రాబాద్‌కు ఉదయం 6.20కు చేరుకుంటుందని అధికారులు పేర్కొన్నారు. రైళ్లకు మొదటి తరగతి, రెండో, మూడో తరగతి, శీతల బోగీలు, స్లీపర్, జనరల్ కోచ్‌లు ఉంటాయని అధికారులు వివరించారు. రైళ్లు కర్నూలు, బళ్లారి, హోస్‌పేట, హుబ్లీ మీదుగా ప్రయాణించనున్నాయి.

లేబర్, టెక్స్‌టైల్స్, స్కిల్ డెవలప్‌మెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా అనంత ఎంపీ

అనంతపురం(కళ్యాణదుర్గంరోడ్డు), న్యూస్‌టుడే: కేంద్ర లేబర్, టెక్స్‌టైల్స్, స్కిల్ డెవలప్‌మెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా అనంతపురం పార్లమెంటు సభ్యుడు అంబికా లక్ష్మీనారాయణను నియమించారు. కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీ ఛైర్మన్‌గా బసవరాజు బొమ్మాయి నియమించగా, లోక్‌సభకు చెందిన 21 మంది, రాజ్యసభకు 10 మంది చొప్పున ఎంపీలు ఉన్నారు. వీరిలో కమిటీలో సభ్యుడిగా నియమించడంపై ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికే కేంద్రం ఓబీసీ, సిల్క్‌బోర్డు సంక్షేమ సభ్యులుగా నియమించారని ఎంపీ గుర్తు చేశారు. తాజాగా కమిటీలో సభ్యుడిగా ఎన్నుకున్నందుకు దేశ ప్రధాని మోదీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబులకు ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు.

ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు తక్షణ ప్రవేశాలు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో మిగిలిపోయిన సీట్లకు ఈ నెల 5న తక్షణ ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు అడ్మిషన్స్ డైరెక్టర్ ఆచార్య నరసింహన్ తెలిపారు. ఐసెట్-2024 అర్హత సాధించిన అభ్యర్థులు అర్హులు. ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ప్రవేశాల విభాగం వద్దకు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

'కేతిరెడ్డి అహంకారమే ఈ స్థితికి దిగజార్చింది'


మాట్లాడుతున్న ఎంపీపీ ఆదినారాయణయాదవ్, నాయకులు

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అహంకారమే ఈ స్థితికి దిగజార్చిందని ఎంపీపీ ఆదినారాయణయాదవ్ విమర్శించారు. మంత్రి సత్యకుమార్‌పై కేతిరెడ్డి చేసిన వ్యాఖ్యలపై గురువారం ఎంపీపీ, భాజపా నాయకులు ముదిగుబ్బలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎవరు ప్రజలను మోసం చేశారో, కబ్జాలకు పాల్పడి, కమీషన్లు దండుకున్నారో ప్రజలకు తెలుసునని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఎస్సీ, ఎస్టీలపై దాడులు చేయించిన ఘటనలు ఇంకా మరచిపోలేదన్నారు. నైతిక విలువల గురించి కేతిరెడ్డి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ఎంపీపీ ఎద్దేవా చేశారు. సమావేశంలో భాజపా నాయకులు వీరాంజనేయులు, కృష్ణమూర్తి, చంద్రశేఖర్, రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు'

కొత్తచెరువు, న్యూస్‌టుడే: దసరా సెలవుల్లో జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఈవో మీనాక్షి ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఈ నెల 13వ తేదీ వరకు అన్ని పాఠశాలలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించిందని తెలిపారు. డీవైఈవోలు, ఎంఈవోలు ప్రైవేటు పాఠశాలల్లో తరగతులు నిర్వహించినట్లు వచ్చిన ఫిర్యాదులపై పరిశీలన జరిపి నివేదిక అందించాలని డీఈఓ కోరారు.

ఆశాజనకంగా టమాటా ధర

అనంతపురం(వ్యవసాయం): టమాటా ధర రోజూ పెరుగుతూనే ఉంది. సాగు చేసి పూత, కాయ దశల్లో ఉన్న రైతులు ఎప్పుడెప్పుడు పంట కోత కొస్తుందోనని ఆశగా ఎదురుచూస్తున్నారు. పంట కోతలు తగ్గాయని, ప్రస్తుతం ధరలు తగ్గే పరిస్థితి ఉండదని వ్యాపారవర్గాలు తెలిపాయి. అనంతపురం గ్రామీణం కక్కలపల్లి మార్కెట్‌లోని 18 మండీలకు గతంలో భారీగా టమాటా వచ్చేది. వారం నుంచి సరకులు పూర్తిగా తగ్గింది. గురువారం మార్కెట్‌కు కేవలం 650 టన్నులు వచ్చాయి. కిలో గరిష్ఠం రూ.77, మధ్యస్థం రూ.67, కనిష్ఠం రూ.51 చొప్పున ధరలు పలికాయి. 15 కిలో బుట్ట ధర చూస్తే గరిష్ఠం రూ.1,170, మధ్యస్థం రూ.1,005. కనిష్ఠం రూ.765 చొప్పున ధరలు పలికాయని మార్కెట్ ఇన్‌ఛార్జి రాంప్రసాద్‌రావు తెలిపారు.

వాహనాలు రావు.. సమాచారం చెప్పరు!

విసుగెత్తిన కార్డుదారులు

అనంతపురం, (కళ్యాణదుర్గం రోడ్డు) న్యూస్‌టుడే: ఎండీయూ వాహనాలు తిరగవు. ఎక్కడ సరకులు ఇస్తారన్న సమాచారం అసలు చెప్పరు. కార్డుదారులంతా చౌకధరల దుకాణాల చుట్టు సంచులు పట్టుకుని నిత్యం తిరుగుతున్నారు. ఈ విషయంలో జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 3,012 చౌకధరల దుకాణాల పరిధిలో 12,08,293 తెల్లకార్డుదారులు ఉన్నారు. ఈనెల 18 వేలమెట్రిక్ టన్నులు బియ్యం 650 మెట్రిక్ టన్నులు పంచదార, 800 మెట్రిక్ టన్నులు కందిపప్పు, కార్డుకు మూడు కిలోల చొప్పున జొన్నలు 3,624 టన్నులు ఇస్తున్నారు. ఏ డీలరు ఎప్పుడు ఎక్కడ సరకులు పంపిణీ చేస్తారో తెలియని పరిస్థితి. ఏ కార్డు ఏ డీలరు పరిధిలో ఉందో తెలియదు. మూడు నెలల నుంచి కార్డులు, సంచులు పట్టుకుని లబ్ధిదారులు పరుగులు తీయాల్సిన పరిస్థితి. గత వైకాపా ప్రభుత్వం హయాంలో ప్రతి సచివాలయానికి ఎండీయూ వాహనాన్ని మ్యాచింగ్ చేశారు. డీలరు వద్ద ప్రతి నెలా ఎండీయూ ఆపరేటర్, వీఆర్వో సంతకం ఈ-పాస్ యంత్రంలో వేలిముద్ర వేయాల్సిందే. ఒక డీలరు తర్వాత ఒక్కరు సరకులు పంపిణీ చేస్తున్నారు. సమస్య మరింత జఠిలమవుతోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవరూ పట్టించుకోవడంలేదు. కార్డుదారుల్లో తీవ్ర నిరాశ వ్యక్తమవుతోంది.


అనంతపురం గ్రామీణం: విద్యారణ్యనగర్‌లో చౌకదుకాణం ముందు వరసలో సంచులు, కార్డులు

అరటి రైతుల ఆదాయం పెంపునకు చర్యలు

అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే : రాయలసీమలో ఉద్యాన హబ్‌గా మార్చాలన్నది రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన ఉద్దేశమని, ప్రధానంగా అరటి నాణ్యత పెంచడమే కాకుండా రైతులకు ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఉద్యానశాఖ సంయుక్త సంచాలకులు దేవమునిరెడ్డి పేర్కొన్నారు. అనంతపురం, కడప, నంద్యాల జిల్లాల ఉద్యానశాఖ అధికారులతో పాటు అరటి పంట అమ్మకందార్లు, కొనుగోలుదారులకు కార్యశాల నిర్వహించారు. ఆయా జిల్లాలో 64 వేల ఎకరాల్లో అరటి సాగవుతోందని, మొత్తం రూ. 12.80 లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తోందని, అయితే మార్కెటింగ్, అరటి నాణ్యత లేక రైతులు నష్టపోతున్నారన్నారు. అరటి నాణ్యత పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ప్రధానంగా గ్రామాలు, క్లస్టర్ల వారీగా అరటి నాణ్యత పెంచేందుకు శిక్షణ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తామన్నారు. అనంతపురం, నంద్యాల జిల్లాల ఉద్యానశాఖ అధికారులు నరసింహారావు, నాగరాజు, ఉద్యాన అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఉద్యానశాఖ జేడీ దేవమునిరెడ్డి, డీడీహెచ్‌లు నరసింహారావు, నాగరాజు, తదితరులు

రేపు పీఎం కిసాన్ సొమ్ము జమ

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే : ఈనెల 5న పీఎం కిసాన్ సొమ్ము రైతులకు ఖాతాలకు జమ చేయనున్నారు. ఒక్కో రైతుకు రూ.2 వేల చొప్పున దేశ ప్రధాని నరేంద్రమోదీ డీబీటీ ద్వారా నేరుగా రైతు ఖాతాల్లోకి జమ చేస్తారు. జిల్లాలో మొత్తం 2,79,161 మంది రైతులకు రూ.55.83 కోట్లు లబ్ధి చేకూరనుంది. అదే రోజు జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో ప్రధాని ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. రైతులంతా హాజరైన విజయవంతం చేయాలని జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ విజ్ఞప్తి చేశారు.

సహజ కాన్పని కాలయాపన..

గర్భంలోనే శిశువు మృతి!

రాత్రంతా ప్రసవ వేదన.. కుటుంబ సభ్యులు ఆందోళన


మైథిలి

హిందూపురం, న్యూస్‌టుడే: ప్రసవానికి వచ్చిన మహిళ గర్భంలోనే శిశువు మృతి చెందిన ఘటన హిందూపురం ప్రభుత్వాసుపత్రిలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకొంది. ఈ ఘటనకు సంబంధించి కుటుంబ సభ్యులు చెప్పిన వివరాలిలా ఉన్నాయి. హిందూపురం పట్టణం మేళాపురానికి చెందిన మైథిలి బుధవారం ప్రసవానికి ప్రభుత్వాసుపత్రికి వచ్చింది. ఆసుపత్రిలో చేర్చుకొన్నప్పటికీ ప్రసవం చేయకుండా సహజ కాన్పు అవుతుందని సిబ్బంది కాలయాపన చేశారు. వైద్యులు అందుబాటులో లేకపోవటంతో ఆమె రాత్రంతా ప్రసవవేదన పడిందని గర్భిణి బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం వైద్యులు శస్త్రచికిత్స చేసి శిశువును బయటకు తీయగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. ఉమ్మనీరు తాగటంతో శిశువు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. వైద్యులు సకాలంలో శస్త్రచికిత్స చేసి ఉంటే బిడ్డ బతికేదని బాధితురాలి బంధువుల ఆందోళన వ్యక్తం చేశారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

రొద్దం, న్యూస్‌టుడే : మండలంలోని తాడింగిపల్లిలో గురువారం గంగాధర్(46) అనే వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గంగాధర్ గ్రామంలో అప్పులు చేసి 8 నెలల కిందట భార్య సునిత, ఇద్దరు పిల్లలతో కలసి పావగడలోని అనుమయ్య పాళ్యంలో నివాసం ఉంటున్నాడు. గురువారం రేషన్ కోసం తాడింగిపల్లికి వచ్చాడు. తల్లి లక్ష్మీదేవమ్మతో ఆకలి అవుతుంది భోజనం పెట్టుకురమ్మని చెప్పి అతడి సొంత ఇంట్లోకి వెళ్లి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లికి అనుమానం వచ్చి స్థానికుల సాయంతో తలుపులు తీసి చూడగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. రొద్దం హెడ్‌కానిస్టేబుల్ మారుతి, సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

రెండో పెళ్లి చేసుకున్న భర్తపై కేసు

గుత్తి, న్యూస్‌టుడే : తనను కాదని మరో యువతిని రెండోపెళ్లి చేసుకున్న భర్తపై గురువారం పోలీసులకు మొదటి భార్య ఫిర్యాదు చేసింది. గుత్తి మండలంలోని బాచుపల్లి జంగాల కాలనీకి చెందిన వెంకటేశ్ ఏడాది కిందట నందిని అనే యువతిని పెళ్లి చేసుకున్నాడు. ఆ సమయంలో ఆమె తల్లిదండ్రులు కట్నం ఇవ్వలేదు. కట్నం లేకుండా పెళ్లి చేసుకున్నానని, ఆమెను భర్త వేధిస్తూ గతనెల 29న తన మేనత్త కుమార్తెను రెండో పెళ్లి చేసుకున్నాడు. దీంతో మొదటి భార్య తన భర్తతోపాటు వెంకటేశ్ మేనత్త, మామ, రెండో భార్యపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు మొత్తం ఐదుగురిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఇంజెక్షన్ వికటించి వ్యక్తి మృతి

మృతదేహంతో బంధువుల నిరసన

నార్పల, న్యూస్‌టుడే : నార్పల ప్రభుత్వ వైద్యశాలలో వేసిన ఇంజెక్షన్ వికటించి కుళ్లాయప్ప(38) మృతి చెందాడని, అతని బంధువులు, దళిత సంఘాల నాయకులు గురువారం ఆందోళనకు దిగారు. నార్పలకు చెందిన కుళ్లాయప్పకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. గురువారం తెల్లవారుజామున కుళ్లాయప్ప తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో నార్పల వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ విధుల్లో ఉన్న స్టాఫ్‌నర్సు ఇంజెక్షన్ ఇచ్చారు. ఆతర్వాత కొన్ని గంటలకే కుళ్లాయప్ప మరణించాడని అతని బంధువులు ఆరోపించారు. తెల్లవారుజామున నర్సుకు బదులుగా ఆమె భర్త ఇంజెక్షన్ వేయడం వల్లే మృతిచెందాడని దళిత సంఘాల నాయకులు వైద్యశాల ఎదుట ఆందోళనకు దిగారు. సీఐ కౌలుట్లయ్య ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ కుళ్లాయప్పకు దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారని, ఈక్రమంలో మృతి చెందాడని చెప్పారు. ఇంజెక్షన్ వికటించడం వల్ల కాదని స్పష్టం చేశారు. ఇంజెక్షన్‌ను స్టాఫ్‌నర్సు వేశారని, ఇతరులెవ్వరూ వేయలేదని ధ్రువీకరించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పుల్లప్ప, సీపీఐ నాయకులు గంగాధర్ మాట్లాడుతూ వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే కుళ్లాయప్ప మరణించడానికి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని, వైద్య సిబ్బంది నిర్లక్ష్యం ఉందని విచారణలో తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హామీ ఇవ్వడంతో బాధితులు ఆందోళన విరమించారు. అనంతరం బాధిత కుటుంబంతో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ చరవాణిలో మాట్లాడి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.


మృతదేహంతో ఆందోళన చేస్తున్న బంధువులు, దళిత సంఘాల నాయకులు

యువతి అపహరణకు యత్నం

శింగనమల, న్యూస్‌టుడే : శింగనమల మండలం చీలేపల్లి గ్రామానికి చెందిన ఓ యువతిని అపహరణకు యత్నించిన ఘటన గురువారం జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు అందించిన వివరాల మేరకు గార్లదిన్నె మండలం కొప్పలకొండకు చెందిన సోమశేఖర్‌తో యువతికి గత రెండు నెలల క్రితం నిశ్చితార్థం చేశారు. నిశ్చితార్థం అనంతరం చరవాణిలో అసభ్యకరంగా మాట్లాడిన సోమశేఖర్ ప్రవర్తన సరిగా లేదని సదరు యువతి తల్లిదండ్రులకు వివరించింది. దీనిపై ఇరు కుటుంబాల వారు చర్చించుకొని వివాహాన్ని రద్దు చేయాలని నిర్ణయించుకున్నారు. అయినా సోమశేఖర్ తరుచూ యువతిని చరవాణిలో వేధిస్తుండేవాడు. ఈక్రమంలో యువకుడు గురువారం ఉదయం చీలేపల్లి గ్రామానికి కొంతమంది యువకులతో వచ్చి యువతిని అపహకరించేందుకు యత్నించాడు. కుటుంబసభ్యులు అప్రమత్తం కావడంతో వెనక్కి వెళ్లిపోయారు. గ్రామస్థులు కలిసి పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం యువతి స్థానిక సీఐ కౌలుట్లయ్యకు ఫిర్యాదు చేసింది. దీనిపై విచారణ చేపట్టామని సీఐ తెలిపారు.

గోడ కూలి చిన్నారి దుర్మరణం


పార్థసారథిరెడ్డి

తాడిమర్రి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని మోదుగులకుంట గ్రామంలో గోడ కూలి పార్థసారథిరెడ్డి(4) అనే చిన్నారి మృతిచెందాడు. గ్రామస్థులు, బంధువుల వివరాల మేరకు.. శివానందరెడ్డి, రజనీ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. వారి ఇంటి సమీపంలో ఉన్న చెట్టు వేర్లు గోడలోకి చొచ్చుకుపోయి పూర్తిగా దెబ్బతిని ఊగుతోంది. గురువారం చిన్నారి చెట్టు వద్దకు వెళ్లి ఆడుకుంటుండగా గోడ కూలి మీద పడింది. తండ్రి, గ్రామస్థులు చిన్నారిని వెంటనే ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఇద్దరు ఆడపిల్లల తరువాత పుట్టిన కుమారుడి మృతితో తల్లిదండ్రులు బోరున విలపించారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

హిందూపురం
•హిందూపురం •పెనుకొండ •మడకశిర

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని వినతి

గోరంట్ల, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు పరిశ్రమ కోసం ఎందరో ప్రాణత్యాగాలు చేశారని, ఎంతో మంది పోరాట ఫలితంగా ఏర్పడి, దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలని వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ, కేవీపీఎస్ తదితర సంఘాల నాయకులు గురువారం గోరంట్ల తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. సంఘాల నాయకులు ఆంజనేయులు, సర్జనత్, వెంకటేశులు, ముత్యాలప్ప తదితరులు పాల్గొన్నారు. **పెనుకొండ:** విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని కోరుతూ వ్యకాసం(వ్యవసాయకార్మికసంఘం), రాష్ట్ర రైతు సంఘాల ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహసీల్దార్ కే శ్రీధర్‌కు వినతి పత్రం అందజేశారు. వ్యకాసం, రైతు సంఘాల నాయకులు హరి, గంగాధర్, బాబావలీ తదితరులు పాల్గొన్నారు.

'కస్తూర్బా'లో కూలిన ప్రహరీ



లేపాక్షి, న్యూస్‌టుడే: మండల వ్యాప్తంగా బుధవారం రాత్రి ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. దీంతో కుంటలన్నీ నీటితో నిండిపోయాయి. 2015లో నిర్మించిన కేజీబీవీ ప్రహరీ కొంతభాగం వర్షంధాటికి కూలిపోయింది. విషయం తెలుసుకున్న ప్రత్యేకాధికారిణి నీలిమ వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. విద్యాలయంలో మొత్తం ఆడపిల్లలే ఉంటారని, తక్షణమే నూతనంగా ప్రహరీని నిర్మించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

కరవు మండలంగా ప్రకటించాలని వినతి

గోరంట్ల: గోరంట్లను కరవు మండలంగా ప్రకటించాలని కోరుతూ మండల తెదేపా కన్వీనర్ సోమశేఖర్ ఆధ్వర్యంలో రైతులు గురువారం స్థానిక తహసీల్దార్ మారుతికి వినతిపత్రం అందజేశారు. మండల వ్యాప్తంగా వేలకుటుంబాలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారని ఈఏడాది కరవు పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయని వినతిలో పేర్కొన్నారు.

ఎంపీపీ మృతికి సంతాపం

రొద్దం : రొద్దం ఎంపీపీ చంద్రశేఖర్ అనారోగ్యంతో మృతి చెందినట్లు గురువారం సమాచారం అందుకున్న హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, వైకాపా నాయకులు వేర్వేరుగా ఆయన భౌతిక కాయన్ని సందర్శించి పూలమాల వేసి సంతాపం తెలియజేసి నివాళులర్పించారు.

దసరా సెలవుల్లో విద్యార్థులకు ఇంటర్న్‌షిప్

గోరంట్ల: కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ ఆదేశాలతో పదో తరగతి విద్యార్థులకు దసరా సెలవులు వృథాకాకుండా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎంశ్రీ పథకంపై ఇంటర్న్‌షిప్ కార్యక్రమం గురువారం నుంచి ప్రారంభించినట్లు ఉపాధ్యాయురాలు శిల్ప పేర్కొన్నారు. గోరంట్ల మండలంలో బూదిలి జడ్పీ ఉన్నత పాఠశాల ఎంపికైందని, 15 మంది విద్యార్థులకు రెండు బృందాలుగా అవగాహన కల్పిస్తూ ఇంటర్న్‌షిప్ కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

చినుకుపడితే విద్యుత్తు అంతరాయం

శ్రీరంగరాజుపల్లి (పరిగి) : చినుకు పడితే విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని శ్రీరంగరాజుపల్లి గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా లైన్‌మెన్ అందుబాటులో లేకపోవడంతో సకాలంలో సరఫరాను పునరుద్ధరించలేక పోతున్నారని గ్రామస్థులు పేర్కొన్నారు. పరిగి ఉప కేంద్రం ఏఈ సంజీవప్ప స్పందిస్తూ సాంకేతిక సమస్యను పరిష్కరించి విద్యుత్తు సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు.

సస్యరక్షణ చర్యలు పాటించాలి

కొడిగెనహళ్లి (పరిగి) : రైతులు పంటల సాగులో సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యమని మండల వ్యవసాయ శాఖ అధికారిణి విజయభారతి సూచించారు. గురువారం మండల పరిధిలోని శ్రీరంగరాజుపల్లి, మోదా గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారుల బృందం పర్యటించి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.

పాలసముద్రం చెరువు మరవ



రెండు రోజులుగా కురుసిన వర్షాలకు పాలసముద్రం చెరువు గురువారం ఉదయం నుంచి మరవ పారుతోంది. దీంతో పరిసర గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలు కురవడంతో పెద్దఎత్తున మరవ పారుతోంది. –న్యూస్‌టుడే, గోరంట్ల

నియంత్రికలు వస్తున్నాయ్..



రచ్చకట్టపై ఉంచిన నియంత్రికలు

వ్యవసాయ బోర్లకు తీరనున్న లో ఓల్టేజీ సమస్య

మడకశిర గ్రామీణం, గుడిబండ, అమరాపురం, న్యూస్‌టుడే: గత వైకాపా హయాంలో మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా రైతుల వ్యవసాయ బోర్లకు విద్యుత్తులో ఓల్టేజీ సమస్యను నివారించేందుకు చర్యలు చేపట్టింది. అప్పట్లో సుమారు రూ.200 కోట్లతో హెచ్‌వీడీఎస్ పథకం ద్వారా ప్రతి రెండు వ్యవసాయ బోర్లకు ఒక నియంత్రిక ఏర్పాటుచేసింది. వైకాపా అధికారంలోకి వచ్చాక వాటి నిర్వహణపై చొరవ చూపకపోవడంతో పథకం లక్ష్యం మూలనపడింది. దీంతో రైతులు లో ఓల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

కూటమి అధికారంలోకి వచ్చాక

మడకశిర నియోజకవర్గంలోని రొళ్ల, అగళి, గుడిబండ, అమరాపురం, మడకశిర మండలాల్లో అత్యధికంగా 80 శాతం మంది వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. బోరుబావుల కింద సాగుచేసిన వరి, రాగి, మల్బరీ, మొక్కజొన్న, మిరప, టమాట, వక్క, దానిమ్మ తదితర పంటలకు లో ఓల్టేజీ సమస్య వెంటాడుతోంది. రైతులు పడుతున్న ఇబ్బందులను స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్యే గుండుమల తిప్పేస్వామి సంబంధిత విద్యుత్తుశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి స్పందించడంతో దాదాపు 480 వ్యవసాయ విద్యుత్తు నియంత్రికలు మంజూరయ్యాయి. ఇప్పటికే 22 వచ్చాయి. వాటిని త్వరగా అమర్చితే వ్యవసాయ బోర్లకు లో ఓల్టేజీ సమస్య తీరుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పది నెలలు కావస్తోంది



తనకు 8 ఎకరాల భూమి ఉంది. బోర్లు తవ్వించగా నీరు వచ్చింది. రెండు వ్యవసాయ కనెక్షన్లు, ఒక నియంత్రికకు దరఖాస్తు చేసినా ఇప్పటి వరకు నియంత్రిక రాలేదు. వ్యవసాయ కనెక్షన్లు ఇవ్వలేదు. వక్క, మల్బరీ, రాగి తదితర పంటలు సాగుచేసేందుకు ఎదురుచూస్తున్నా. తొందరగా నియంత్రిక ఏర్పాటు చేస్తే బాగుంటుంది.
-కమలమ్మ, మహిళా రైతు, మందలపల్లి

త్వరలో మంజూరు కానున్నాయి

నియోజకవర్గంలో 1200 వ్యవసాయ కనెక్షన్లు, 480 నియంత్రికల కోసం దరఖాస్తులు అందాయి. ఇప్పటికే 22 వచ్చాయి. మిగతావి త్వరలో సరఫరా కానున్నాయి. వాటిని అమర్చి, వ్యవసాయ కనెక్షన్లు ఇచ్చి రైతుల సమస్యలు పరిష్కరిస్తాం.
- సిద్దేశ్వర, ఏఈ, అమరాపురం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)


హిందూపురం: 80085 73018, పెనుకొండ: 91000 20922, మడకశిర: 76759 19016

సమస్య: స్నేహలతా నగర్‌లోని వీధిలో మురుగు పారుతోంది. **-సలీమ**
సమాధానం: వెంటనే చర్యలు చేపడతాం. **-రామాంజనేయులు, ఇన్‌ఛార్జి గ్రామ కార్యదర్శి, సోమందేపల్లి** – న్యూస్‌టుడే, సోమందేపల్లి
సమస్య: కొడికొండ చెక్‌పోస్టు మూలమలుపు ఏపీ టూరిజం సమీపంలో చెత్త వేస్తున్నారు. దుర్వాసన వస్తోంది. **-నాగేంద్ర, కొడికొండ చెక్‌పోస్టు**
సమాధానం: పంచాయతీ సిబ్బందిని పంపించి శుభ్రం చేయిస్తాం. దుకాణదారులు, హోటల్ నిర్వాహకులు చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటాం. **-మురళీమోహన్, సర్పంచి, చిలమత్తూరు**
సమస్య: చిలమత్తూరు ప్రధాన రహదారి పక్క మురుగుతో నిండింది. **- సంతోష్‌కుమార్, చిలమత్తూరు**
సమాధానం: పంచాయతీ సిబ్బందిని పంపించి వెంటనే శుభ్రం చేయిస్తాం. **- రామ్లునాయక్, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి** –న్యూస్‌టుడే, చిలమత్తూరు
సమస్య: చిగతుర్పి బీసీ కాలనీలో వీధి దీపాలు వెలగక అంధకారంలో ఉంటున్నాం. **- గాయిత్రి**
సమాధానం: రెండు రోజుల్లో ఏర్పాటు చేస్తాం. **- శివరుద్రమ్మ, సర్పంచి**
సమస్య: రాళ్లపల్లి ఎస్సీ కాలనీలో నీటి సమస్య. **- కమలమ్మ**
సమాధానం: సత్వరమే పరిష్కరిస్తాం. **-లక్ష్మీనారాయణ, సర్పంచి**
–న్యూస్‌టుడే, గుడిబండ

సమస్యల పరిష్కారం

స్పందనకు వందనం

గుడిబండ: మండలంలో నెలకొన్న వివిధ సమస్యలను మేమున్నాం..మీకుతోడుగా శీర్షికన ప్రచురించగా బాధ్యులు స్పందించారు. ● కెంచయ్యపాళ్యంలో శంకరగల్లు సర్పంచి జయమ్మ వీధి దీపాలు ఏర్పాటుచేసి అంధకారం తొలగించారు. ● ఇటికేపల్లి ఎస్సీ కాలనీలో ఈఓఆర్‌డీ నాగరాజునాయక్ హరితరాయబారుల ద్వారా మురుగును తొలగించారు. ● భైరేపల్లి ఎస్సీకాలనీలో సీసీగిరి సర్పంచి ఎంజారేగౌడు హరితరాయబారుల ద్వారా మురుగును తొలగించారు. ● గుడిబండ సర్పంచి కరుణాకర్‌గౌడు గుడిబండ ఆర్టీటీ కాలనీలో వీధి దీపాలు ఏర్పాటుచేసి అంధకారం తొలగించారు. ● ఎన్‌ఆర్‌రొప్పంలో రాళ్లపల్లి సర్పంచి లక్ష్మీనారాయణ వీధి దీపాలు ఏర్పాటుచేసి వెలుగులు నింపారు. ● జమ్మలబండ ఎస్సీకాలనీలో సర్పంచి నరసమ్మ హరితరాయబారుల ద్వారా మురుగును తొలగించారు. ● రాళ్లపల్లిలో సర్పంచి లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి గోవిందప్ప పైపులైన్ లీకేజీ నివారించారు. ● ముతుకూరు, ఇటికేపల్లి రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను ఎంపీడీఓ రామారావు తొలగింపజేశారు.



గోరంట్లలో ..



సోమందేపల్లి: రాముడిగా



లేపాక్షిలో..



రొళ్లలో..



అర్ధనారీశ్వరి అలంకరణలో.



శ్రీశైలపుత్రిగా
కొల్హాపురమహాలక్ష్మి

భక్తిశ్రద్ధలతో
శరన్నవరాత్రులు

ఆయా గ్రామాల్లో వెలసిన దేవీ ఆలయాల్లో గురువారం నుంచి శరన్నవరాత్రులు ప్రారంభమయ్యాయి. చౌడేశ్వరీ, వాసవి కన్యకా పరమేశ్వరీ, మరిగమ్మ, గంగమ్మ, అంబాభవాని, కొల్హాపురి మహాలక్ష్మి, కాళికాదేవి తదితర అమ్మవార్లు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. –న్యూస్‌టుడే బృందం



కొటిపి రోడ్డులో..



చంద్రగిరిలోని శక్తిపీఠంలో

ఇన్‌ఛార్జి తహసీల్దార్‌గా సౌజన్య

చిలమత్తూరు: చిలమత్తూరు ఇన్‌ఛార్జి తహసీల్దార్‌గా సౌజన్యను నియమిస్తున్నట్లు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. గతంలో ఇక్కడ పనిచేసిన ఆనంద్‌కుమార్ సబ్‌కలెక్టర్‌గా పదోన్నతి రావడంతో ఆయన బదిలీపై పెనుకొండకు వెళ్లారు. మండలంలోని రైతులు ఎలాంటి సమస్య పడకుండా ఉండేందుకు లేపాక్షిలో పని చేస్తున్న సౌజన్య వచ్చారు.

ఎంపీడీవోలు బాధ్యతల స్వీకరణ

గోరంట్ల : గోరంట్ల మండల ఎంపీడీవోగా నరేంద్రకుమార్ గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈయన హిందూపురం మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.
లేపాక్షి : లేపాక్షి ఎంపీడీవోగా నరసింహమూర్తి గురువారం పదవీ బాధ్యతలు తీసుకున్నారు. గుమ్మగట్ట మండలం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చినట్లు ఆయన తెలిపారు.

చెత్త తొలగించారు..

ఈనాడు కథనానికి స్పందన

హిందూపురం అర్బన్: 'తొలగని చెత్తాచెదారం' శీర్షికన గురువారం చిత్ర వార్త ప్రచురితమైంది. వెంటనే స్పందించిన మున్సిపల్ కమిషనర్ పారిశుద్ధ్య కార్మికులను పంపి డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తను తొలగింపజేశారు. శుభ్రం చేసినందుకు 'ఈనాడు'కు, అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళా సాధికారత కోసమే శిక్షణ



ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీ బీకే పార్థసారథి, భాజపా నాయకులు

పెనుకొండ, న్యూస్‌టుడే: మహిళా సాధికారిత కోసమే భాజపా సభ్యత్వ నమోదు బాధ్యుడు గోపీనాథ్ ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని 11 రోజులపాటు ఉచితంగా మహిళలకు బ్యూటీషియన్ కోర్సుపై శిక్షణ ఇవ్వడం మంచి పరిణామం అని ఎంపీ బీకే పార్థసారథి అన్నారు. గురువారం కోర్సు పూర్తి చేసుకొన్న 116 మందికి పట్టణ శివారులోని త్రిపురా రిసార్ట్స్‌లో భాజపా జిల్లా అధ్యక్షుడు జీఎం.శేఖర్, ఎంపీ ఆధ్వర్యంలో ధ్రువపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పలువురు ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

బస్సు లేక విద్యార్థుల అవస్థలు



ఆటో ఎక్కుతున్న విద్యార్థినులు

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: గుండుమల ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు బస్సు లేక కళాశాలకు రావడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దసరా సెలవులు రావడంతో ఆర్టీసీ బస్సు రెండు రోజులుగా తిప్పడం మానేశారు. కళాశాలకు నియోజకవర్గంలోని గుడిబండ, అమరాపురం, రొళ్ల మండలాల నుంచేగాక పరిగి, హిందూపురం నుంచి వస్తున్నారు. గతంలో బస్సు పాసుకు నెలకు రూ.250లు చెల్లించేవారు. సెలవుల కారణంగా బస్సు తిరగకపోవడంతో ఆటోలకు ఒక్కొక్కరు రూ.50 నుంచి 100లు ఖర్చుచేసుకుని వస్తున్నామని వాపోయారు. దీనికి తోడు ఆటోల్లో పదుల సంఖ్యలో ఎక్కిస్తుండటంతో ఎక్కడ ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టీసీ అధికారులు చొరవ తీసుకుని బస్సును పునరుద్ధరించాలని కోరారు. ఈ విషయమై ఏడీసీ హనుమంతరాయప్ప మాట్లాడుతూ దసరా సెలవులని బస్సును నిలుపుదల చేశాం.. శుక్రవారం నుంచి యథావిధిగా బస్సు నడుపుతామని తెలిపారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



మోటారు అమరుస్తున్న సిబ్బంది

అమరాపురం, న్యూస్‌టుడే: హాలదపల్లి గ్రామంలో కొన్ని నెలలుగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉండేది. ఇటీవల బోరు వేయించగా నీరు పుష్కలంగా పడ్డాయి. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మనునాయక్, సర్పంచి ఈరన్న మాజీ సర్పంచులు పాండురంగప్ప, చంద్రప్పలు బోరుకు మోటారు అమర్చి పాతపైప్ లైన్‌కు అనుసంధానం చేశారు. గ్రామానికి నీరు సరఫరా కావడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.


రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థినులు సుప్రియ, చంద్రిక

హిందూపురం గ్రామీణం,న్యూస్‌టుడే: సంతేబిదనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న సుప్రియ, చంద్రికలు రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు కల్పన తెలిపారు. యోగాలో భాగమైన రిథమిక్ ఫెయిర్ విభాగంలో ప్రతిభ కనబరిచారని, ఈనెల 5నుంచి 7వరకు కర్నూలులో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. అలాగే మరో విద్యార్థి కల్యాణ్‌రాయ్ జిల్లా యోగా పోటీలకు ఎంపికయ్యారు. ప్రతిభ చూపిన విద్యార్థులను గురువారం పీడీ శ్రీరామనాయక్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ట్యాంకు తొలగించండి



లేపాక్షి బసవన్నవీధి ప్రాథమిక పాఠశాల ఆవరణంలోని నీటి ట్యాంకు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉంది. ఏదైనా జరిగితే పెద్దఎత్తున ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని గ్రామస్థులు తెలిపారు. ఎంఈవో నాగరాజునాయక్ మాట్లాడుతూ శిథిలావస్థకు చేరినట్లైతే తొలగించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ప్రతిపాదిస్తామని తెలిపారు. –న్యూస్‌టుడే, లేపాక్షి

స్తంభం.. అలంకారప్రాయం




కొడికొండ శిర జాతీయ రహదారిలో రోడ్డు ప్రమాదాల నివారణకు మలుపు వద్ద ఏర్పాటు చేసిన సిగ్నల్ లైట్ పనిచేయడం లేదు. ధనాపురం మలుపు వద్ద తరచూ వాహన ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిపై సంబంధిత హైవే అథారిటీ డీఈ గిడ్డయ్య దృష్టికి తీసుకెళ్లగా పనిచేసేలా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. –న్యూస్‌టుడే, పరిగి

రోడ్డుపై పశువులు.. చోదకులకు కష్టాలు



సోమందేపల్లిలోని పలు కూడళ్లల్లో ప్రజలు, వాహనాల రాకపోకలకు పాడి పశువులు తీవ్ర అడ్డంకిగా మారాయి. ఉదయం-సాయంత్రం వేళల్లో ముఖ్యంగా రాత్రిళ్లు రహదారులు, ఫుట్‌పాత్‌లపై ఉంటున్నాయి. వాహనాలకు అకస్మాత్తుగా అడ్డు వస్తాయో తెలియక ప్రజలు, చోదకులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయాన్ని పరిశీలించి, చర్యలు తీసుకుంటామని ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ శ్రీధర్ తెలియజేశారు. – న్యూస్‌టుడే, సోమందేపల్లి

చెట్టు ఎండింది.. ప్రమాదం పొంచి ఉంది



అమరాపురం ఎస్సీ బాలుర వసతి గృహం ఆవరణలో పెద్దచెట్టు ఎండి కొమ్మలు విరిగిపడుతున్నాయి. ఇదే వసతి గృహంలో 90 మందికి పైగా విద్యార్థులు ఆటలు ఆడే సమయంలో కొమ్మలు విరిగి పడితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఈ విషయమై వర్డెన్ మాధవిని వివరణ కోరగా ఉన్నతాధికారులతో మాట్లాడి ఎండిపోయిన చెట్టును తొలగిస్తామన్నారు. –న్యూస్‌టుడే, అమరాపురం

కంటైనర్ బోల్తా.. తప్పిన పెను ప్రమాదం

సోమందేపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని పాపిరెడ్డిపల్లి చెరువు వద్ద జాతీయ రహదారిపై గురువారం రాత్రి సిగరెట్ల లోడుతో బెంగళూరు వెళ్తున్న కంటైనర్‌ను కర్పూరం లోడుతో వెళ్తున్న మరో కంటైనర్ వెనుకవైపు నుంచి బలంగా ఢీకొట్టిందని ఏఎస్సై మురళీమోహన్ తెలిపారు. దీంతో సిగరెట్ల కంటైనర్ రహదారిపై బోల్తా పడటంతో అందులో ఉన్న ఇద్దరు క్లీనర్లకు స్వల్ప గాయాలయ్యాయి. వాహనాల రాకపోకలు స్తంభించడంతో పొక్లయిన్ సాయంతో కంటైనర్‌ను పక్కకు తొలగించామన్నారు. అర గంట తర్వాత వాహనాల రాకపోకలను పునరుద్ధరించామని ఏఎస్సై వివరించారు.

ఆ పాఠశాలలు.. క్రీడాకారులకు నిలయాలు



మైదానంలో తర్ఫీదు పొందుతున్న విద్యార్థులు

లేపాక్షి, పరిగి, న్యూస్‌టుడే: వారంతా గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరి అటు చదువుతో పాటు క్రీడల్లోనూ సత్తా చాటుతూ అందరి మన్ననలు అందుకుంటున్నారు. దీంతో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వివిధ స్థాయిల్లో నిర్వహించిన పోటీల్లో ఈ పాఠశాలలు వరుసగా మూడేళ్లు మొదటి ఐదు స్థానాల్లో నిలిచి క్రీడా ప్రతిభా అవార్డులు దక్కించుకున్నాయి. అవే లేపాక్షి మండలంలోని పులమతి, పరిగిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు.

లేపాక్షి మండలంలోని పులమతి ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడిగా రామాంజినేయులు ఆరేళ్ల కిందట పదవీ బాధ్యతలు తీసుకున్నారు. నాటి నుంచి నేటి వరకు పాఠశాలలో చదివే విద్యార్థులు వాలీబాల్, త్రోబాల్‌తో పాటు ఖోఖో వంటి క్రీడల్లో ప్రతిభ చాటుతూ పేరు ప్రఖ్యాతలు గడించారు. దాదాపు వంద మందికి పైగా విద్యార్థులు నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. స్కూల్ గేమ్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 2020-21, 2021-22 విద్యా సంవత్సరాల్లో నిర్వహించిన పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయిలో నాల్గో స్థానంలో నిలవగా, 2022-23లో మూడో స్థానంలో నిలిచి క్రీడా ప్రతిభ అవార్డుకు ఎంపికయ్యారు. దీంతో పాటు ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయ అవార్డు సైతం అందుకుని అందరి హృదయాల్లో చెరగని ముద్ర వేశారు.

పరిగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు అటు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తున్నారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడల్లో వీరు వరుసగా మూడు పర్యాయాలు జిల్లాలో అత్యధిక పాయింట్లు సాధించి మొదటి ఐదు స్థానాల్లో నిలిచారు. పాఠశాలకు చెందిన తేజ ఫుట్‌బాల్‌లో జాతీయ స్థాయిలో, లాంగ్‌జంప్‌లో వంశీ, ఫుట్‌బాల్‌లో శ్వేత, గంగోత్రి, రగ్బీలో అర్చన, ప్రవళిక, ఫుట్‌బాల్‌లో సాయిచరణ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటారు. వీరితో పాటు పలువురు విద్యార్థులు అథ్లెటిక్స్, ఖోఖో, కబడ్డీ, యోగా వంటి క్రీడల్లో సత్తా చాటుతూ పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకొస్తున్నారు. భవిష్యత్తులోనూ క్రీడల్లో రాణిస్తూ క్రీడాకోటాలోనే ఉన్నత చదువులు చదువుతామని విద్యార్థులు పేర్కొంటున్నారు.

ఆయుర్వేదం.. ఆరోగ్యం

ఔషధ మొక్కలు పెంచి అవగాహన కల్పిస్తూ..



ఔషధ మొక్కలపై అవగాహన కల్పిస్తున్న డా.అనూరాధ

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఆయుష్మాన్ భారత్ ద్వారా ఉమ్మడి అనంతపురం జిల్లాలో లేపాక్షి, గోరంట్ల, సేవామందిరం, పుట్టపర్తి, అనంతపురం, పామిడి తదితర 12 ప్రాంతాల్లో ఈ వైద్యశాలున్నాయి. కాని సంతేబిదునూరులో ఉన్న ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వైద్యాధికారిణి వై.అనూరాధ మాత్రం ఆపుపత్రి ఆవరణలో ఔషధ మొక్కలు పెంచి వచ్చిన రోగులను చైతన్యవంతులను చేసి వారి ఆరోగ్యం మెరుగయ్యేలా కృషి చేస్తున్నారు. ఇదొక్కటే పంచకర్మ సేవా కేంద్రం. జిల్లాలోని రోగులే కాదు పొరుగున కర్ణాటకలోని దొడ్డబళ్లాపురం, చిక్కబళ్లాపురం, గౌరిబిదనూరు, పావగడ, మధుగిరి ప్రాంతాల నుంచి ఇక్కడికి రోజూ 60 నుంచి 70మంది రోగులు వస్తుంటారు. వీరిలో 10మంది పంచకర్మ వైద్య సేవలు పొందుతున్నారు.

30 రకాలకు పైగా పెంచుతూ..

ప్రధానంగా ఆస్పత్రి ఆవరణంలో ఆముదం, ఉసిరి, అల్లం, కలబంద, పసుపు, అర్జున, అశ్వగంధ, శతావరి ఇలా 30 రకాల ఔషధపు మొక్కలు పెంచి అవి ఏ వ్యాధిని నయం చేయడానికి ఉపయోగపడతాయనేవి బోర్డుపై రాసి చెట్ల మొదల్లోనే ఉంచారు. వ్యాయామం, యోగా సాధనతో మానసిక స్థైర్యం కల్పిస్తున్నారు. చికిత్స పొందిన రోగులు పెరిట్లోకి వచ్చి ఔషధపు మొక్కలను చూసి అవగాహన పెంచుకుంటున్నారు. 2023లో జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్ ఆస్పత్రిని సందర్శించి తాను ఆయుర్వేద వైద్యం ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆరోగ్య పౌరులు కావాలని ఆకాంక్షించారు.

తీసుకునే ఆహారంతోనే రోగాలు దూరం



రోజూ మనం తీసుకునే ఆహారంతోనే ఆరోగ్యం పొందవచ్చు. బ్రహ్మముహూర్తంలో నిద్రలేవడం, రాత్రి నిద్రించేవరకు పాటించాల్సిన పద్ధతులు, రుతు సంబంధిత చర్యలు అనేవి ఆయుష్ పద్ధతిలో పాటిస్తే రోగాలు దరిచేరవు. మధుమేహం, రక్తపోటు, గుండెపోటు ఇతర వ్యాధులకు సంబంధించి రోగులకు అవగాహన కల్పించేలా చార్టులు రూపొందించాం. ఉత్తమ, నాణ్యమైన సేవలను ఆయుర్వేద వైద్య విధానం ద్వారా అందించాలన్నదే ఆస్పత్రి లక్ష్యం. ఆసుపత్రి ఆవరణలో ఔషధ మొక్కలు నాటి వాటి ద్వారా కలిగే లాభాలను వివరిస్తున్నా.
- వై.అనూరాధ, వైద్యాధికారిణి

పుట్టపర్తి
•పుట్టపర్తి •ధర్మవరం • కదిరి •రాప్తాడు

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థితో హెచ్‌ఎం, వ్యాయామ ఉపాధ్యాయిని

తలుపుల, న్యూస్‌టుడే: తలుపుల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న రహాన్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయిని మహేశ్వరి తెలిపారు. ఇటీవల జరిగిన అండర్-17 పోటీల్లో ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. విద్యార్థిని హెచ్‌ఎం శంకరన్న అభినందించారు.

ప్రశాంతి నిలయంలో దసరా ఉత్సవాలు ప్రారంభం

పుట్టపర్తి: ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ వేదపురుష సప్తాహజ్ఞాన యజ్ఞం ప్రశాంతి నిలయంలో ఈ నెల 6న ప్రారంభం కానుంది. ఏటా విజయదశమిని పురస్కరించుకొని యజ్ఞం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గురువారం సాయికుల్వంత్ మందిరంలోని ధ్యానమందిరంలో వేదపండితులు గణపతిపూజ నిర్వహించి, పురుషసూక్తములు పఠిస్తూ కలశస్థాపన చేశారు. ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్, సతీమణి హిమవాహిని కలశస్థాపన పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. వేదపండితులకు పూజాద్రవ్యాలను సమర్పించారు. శివలింగానికి అభిషేకపూజలు చేశారు. పూర్ణచంద్ర ఆడిటోరియంలో 6న నుంచి వేదపురుషసప్తాహజ్ఞాన యజ్ఞాన్ని 27 మంది వేదపండితులు నిర్వహించనున్నారు. 12న పూర్ణాహుతితో యజ్ఞం ముగుస్తుంది. ట్రస్టు వర్గాలు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు.

ఎస్‌ఐల నియామకం

ధర్మవరం: ధర్మవరం ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌కు ఇద్దరు ఎస్‌ఐలను నియమించారు. పుట్టపర్తి వీఆర్‌లో ఉన్న ఎస్‌ఐ కె.గోపీకుమార్, కె.మహమ్మద్‌రఫీను నియమిస్తూ పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. పుట్టపర్తి వీఆర్ నుంచి ధర్మవరం రెండో పట్టణ ఎస్‌ఐగా శ్రీరాములును నియమించారు.

విద్యుత్తు అక్రమ చౌర్యాన్ని అరికట్టండి

తాడిమర్రి, న్యూస్‌టుడే: తాడిమర్రి పడమటి చెరువులో కొందరు అనధికార బోర్లు వేసి విద్యుత్తు చౌర్యానికి పాల్పడుతున్నారని పలువురు రైతులు ఆరోపించారు. గురువారం తాడిమర్రిలోని విద్యుత్తు కార్యాలయానికి చేరుకొని సబ్ ఇంజినీర్ రవికి ఫిర్యాదు చేశారు. పంటలకు సకాలంలో విద్యుత్తు సరఫరా కాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. మోటార్లు కూడా కాలిపోతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి పోరాటం

కదిరి, న్యూస్‌టుడే: ఆర్టీసీలోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎంఈఎఫ్, జైభీమ్ అసోసియేషన్లు సమష్టిగా పోరాటం చేస్తాయని ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్రనాథ్ తెలిపారు. ఆర్టీసీ బస్టాండు ఆవరణలో రెండు అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఉద్యోగుల సమస్యలపై సమావేశం నిర్వహించి చర్చించారు. జైభీమ్ అసోసియేషన్ కార్యదర్శి గంగాధర్, ఆయా సంఘాల నాయకులు ఆర్జీ నాయక్, విశ్వనాథ్, గంగరాజు, జీఎస్‌స్వామి, రమణప్ప, ఎస్.వెంకటనర్సు పాల్గొన్నారు.

రేపు మెగా వైద్యశిబిరం

కదిరి, న్యూస్‌టుడే: కదిరిలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 5న ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. కందికుంట నారాయణమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగే వైద్యశిబిరంలో గుండె, క్యాన్సర్, కిడ్నీ, కీళ్లనొప్పులు, షుగర్, బీపీ, గ్యాస్ట్రిక్ వంటి రోగులకు పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందిస్తారన్నారు. ఈ సందర్భంగా కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ నగేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల సహాయ నిరాకరణ

పుట్టపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: తపాలా ఉద్యోగులు తమ డిమాండ్ల సాధన కోసం సహాయ నిరాకరణకు దిగారు. గ్రామ్‌సడక్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా ఆయా కార్యాలయాల పరిధిలో మూడు రోజుల పాటు సహాయ నిరాకరణ చేపడుతున్నట్లు చెప్పారు. అందులో భాగంగా గురువారం విధులు బహిష్కరించి కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆసంఘం నాయకులు అల్లాబక్ష్, రామాంజనేయులునాయక్ మాట్లాడారు.

వంద రోజుల పని సద్వినియోగం చేసుకోవాలి

కొత్తచెరువు, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకంలో వంద రోజుల పనిదినాలను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ విజయేంద్రప్రసాద్ సూచించారు. కొత్తచెరువు సర్పంచి రాధ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయంలో గురువారం ఉపాధి పనులపై నిర్వహించిన గ్రామసభకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు పొందిన ప్రతి కుటుంబానికి ఏడాదిలో వంద రోజులు ప్రభుత్వం ఉపాధి కల్పిస్తోందన్నారు. మండలంలోని ఇరగంపల్లి, బండ్లపల్లి, భైరాపురం, పోతులకుంట, లింగారెడ్డిపల్లిలో గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీడీ రఘునాథరెడ్డి, కార్యదర్శి సురేంద్రనాథరెడ్డి, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: వన్యప్రాణులను కాపాడుకోవడం అందరి బాధ్యత అని కదిరి అటవీక్షేత్రాధికారి గుర్రప్ప అన్నారు. వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా గురువారం కదిరి బ్లూమూన్ విద్యాసంస్థలలో 'వన్యప్రాణులు.. సంరక్షణ' అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు.

చదువుల గుడికి అపూర్వ సాయం

ముదిగుబ్బ, ధర్మవరం పట్టణం, పుట్టపర్తి పట్టణం, తనకల్లు, నల్లమాడ, న్యూస్‌టుడే: ఓనమాలు దిద్ది.. విద్యాబుద్ధులు నేర్పిన బడులకు పూర్వ విద్యార్థులు చేయూతనందిస్తున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యలు, అవసరాలను తెలుసుకుని తమ వంతు సాయం చేస్తున్నారు. చేయి చేయి కలిపి విరాళాలు సేకరించి బీరువాలు, బెంచీలు, మైక్‌సెట్‌లు అందజేస్తున్నారు. విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్నారు. రూ.లక్షలు ఖర్చు పెట్టి భవనాలు నిర్మించి తరగతి గదుల కొరత తీరుస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు పూర్వవిద్యార్థులు.



ముదిగుబ్బ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలకు బీరువా, మైక్‌సెట్ వితరణ చేస్తున్న పూర్వవిద్యార్థులు



చిన్నంపల్లి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సరస్వతి విగ్రహం

సామగ్రి వితరణ ఇలా..

- ముదిగుబ్బలో 1991-92 సంవత్సరం పదోతరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు బాలుర ఉన్నత పాఠశాలకు రూ.15వేలు విలువచేసే మైక్‌సెట్ అందించారు. బాలికల ఉన్నత పాఠశాలకు రూ.10వేలు విలువచేసే బీరువా వితరణ చేశారు.
- ధర్మవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1983-86 సంవత్సరం చదువుకున్న పూర్వవిద్యార్థులు రూ.5లక్షలతో సిబ్బంది కోసం గది నిర్మించారు. 20021-23 బ్యాచ్ విద్యార్థులు గ్రంథాలయంలో పుస్తకాల ఏర్పాటు కోసం రూ.50వేలు విలువచేసే ఇనుప ర్యాకులు అందించారు. రూ.1.50లక్షల విలువైన బెంచీలు వితరణ చేశారు.
- పుట్టపర్తిలోని చిన్నంపల్లి ఉన్నత పాఠశాలలో 2009-10 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు రూ.50వేలు ఖర్చు చేసి సరస్వతి విగ్రహం ఏర్పాటు చేశారు. ఏటా పాఠశాలలో విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్నారు.
- ఎనుములపల్లి ఉన్నత పాఠశాలలో పూర్వవిద్యార్థి మహ్మద్ రఫీ తాగునీటి కుళాయిలు, సంపు, నీళ్లట్యాంకు ఏర్పాటు చేయించారు.
- నల్లమాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో రూ.4.50 లక్షలు ఖర్చు చేసి సరస్వతి విద్యా మందిరం నిర్మించారు.
- తనకల్లు జడ్పీ ఉన్నత పాఠశాలలో 1997-98 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు ఎన్‌సీసీ విద్యార్థులకు రూ.35వేలు విలువచేసే ఏకరూప దుస్తులు అందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

పుట్టపర్తి: 80085 73039, కదిరి: 80085 73033, ధర్మవరం: 99596 98222



సమస్య: ధర్మవరం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన విద్యుత్తు నియంత్రిక దిమ్మె ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. నూతన దిమ్మె నిర్మించాలి. **- సిద్ధయ్యగుట్ట కాలనీవాసులు**

సమస్య: సిద్ధయ్యగుట్ట కాలనీలో పలు వీధుల్లో తీగలు చేతికందే ఎత్తులో ఉన్నాయి. కిందకు వేలాడుతుండటంతో వాహన రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. **- కాలనీవాసులు**

సమాధానం: ప్రమాదకరంగా ఉన్న దిమ్మె స్థానంలో కొత్తది ఏర్పాటు చేస్తాం. చేతికందుతున్న తీగలను సరిచేసి కాలనీ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

(పై రెండు ప్రశ్నలకు పట్టణ విద్యుత్తుశాఖ ఏడీ లక్ష్మీనరసింహ సమాధానాలిచ్చారు.) – న్యూస్‌టుడే, ధర్మవరం పట్టణం

సమస్య: కుమ్మరవాండ్లపల్లి ప్రధాన రహదారి సమీపంలో మసీదు, విద్యుత్తు ఉపకేంద్రం సమీపంలో చిరు వ్యాపారులు వ్యర్థాలు వేస్తున్నారు. గాలికి చెత్త ఎగిరి ప్రజలపై పడుతుంది. వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలి. **- షేక్ వలి, కుమ్మరవాండ్లపల్లి**



సమస్య: కుమ్మరవాండ్లపల్లి గ్రామం నుంచి మత్తినగారిపల్లి, బాలప్పగారిపల్లి, బాలప్పగారిపల్లి కాలనీ, మదీనా కాలనీ, మౌజన్ కాలనీలకు వెళ్లే ఎస్సీ కాలనీ రహదారిలో వీధి దీపాలు వెలగడం లేదు. మరమ్మతులు చేయించాలి. **- రమణ, బాలప్పగారిపల్లి కాలనీ**

సమాధానం: వ్యర్థాలు వేయకుండా చూస్తాం. ఎస్సీ కాలనీలో వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం.

(పై ప్రశ్నలకు పంచాయతీ కార్యదర్శి పద్మజ సమాధానం ఇచ్చారు.) – న్యూస్‌టుడే, కదిరి గ్రామీణం

ఆకట్టుకున్న ప్రేమవాహిని నృత్య నాటిక



చిన్నారుల నృత్య ప్రదర్శన

పుట్టపర్తి, న్యూస్‌టుడే: భగవంతునిపై విశ్వాసం పెంపొందించుకుని, లక్ష్య సాధనతో ముందుకు వెళ్తే విజయం సాధిస్తారనే సందేశాన్ని నాటిక రూపంలో చిన్నారులు అద్భుతంగా ప్రదర్శించారు. గురువారం సాయికుల్వంత్ మందిరంలో మహబూబ్‌నగర్ బాలవికాస్ చిన్నారులు 'ప్రేమవాహిని' నృత్య నాటికను ప్రదర్శించారు. సత్యసాయి అవతార వైభవం ద్వారా ప్రపంచ మానవాళికి అందించిన మహిమలను నాటిక రూపంలో వివరించారు. నిరుపేదలకు కుట్టుమిషన్లు, గ్రౌండర్లు, పరికరాలు తదితరాలను ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జేరత్నాకర్ పంపిణీ చేశారు. సత్యసాయి భక్తిగీతాలను శ్రావ్యంగా ఆలపించారు. భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. రెండు రోజుల మహబూబ్‌నగర్ జిల్లా భక్తుల పర్తియాత్ర ముగిసింది.

పుట్టపర్తి, న్యూస్‌టుడే: సత్యసాయి భక్తిగీతాలను ఆలపిస్తూ.. తెలంగాణ సంప్రదాయ నృత్యాలను ప్రదర్శిస్తూ శ్రీసత్యసాయి రథోత్సవం నగర సంకీర్తన పురవీధుల్లో ఘనంగా నిర్వహించారు. గురువారం రాత్రి సత్యసాయి రథోత్సవ నగర సంకీర్తనను ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జేరత్నాకర్ ప్రారంభించారు. మహబూబ్‌నగర్ జిల్లా భక్తులు చిరుజల్లుల నడుమ కలశాలు చేతబట్టి, బోనాలతో స్వాగతం పలుకుతూ.. కోలాటం, చెక్కభజలు చేస్తూ నగర సంకీర్తన నిర్వహించారు. సత్యసాయి మానవాళికి అందించిన సత్యం, ధర్మం, ప్రేమ, శాంతి, అహింస సూత్రలను ప్రదర్శించారు.

గుంతల రోడ్డు బాగుకు చర్యలు



మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని హిందూపురం క్రాస్‌రోడ్డులో గుంతల సమస్య లేకుండా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ చర్యలకు ఉపక్రమించారు. హిందూపురం క్రాస్ నుంచి వాసవీ మెడికల్స్ వరకు రోడ్డును మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, ఇంజినీర్లతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ మార్గంలో అధిక లోడు సామర్థ్యంలో సిమెంటు లారీలు వెళ్తుంటాయి. ఈ కారణంగా తరచూ గుంతలు పడుతున్నాయి. సమస్యను అధిగమించేలా పరిష్కారానికి రోడ్డు నిర్మాణం జరగాలని ఎమ్మెల్యే సూచించారు. రోడ్డును అడుగుభాగం వరకు తొలగించి, నిర్మాణం పటిష్టంగా ఉండేలా నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు.

కదిరి: మున్సిపల్ పరిధి ఆరోవార్డులోని కందికుంట నారాయణమ్మ కాలనీలో నూతనంగా తాగునీటి బోరు ఏర్పాటు చేశారు. బోరుబావిని గురువారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రారంభించారు. దీంతో ఆలయం, కాలనీ వాసులకు నీటి సదుపాయం కలిగింది.

ఆర్డీఓ బాధ్యతల స్వీకరణ



వెంకట సన్యాసిశర్మ

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కదిరి ఆర్డీఓగా వెంకటసన్యాసిశర్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా అల్లూరిసీతారామరాజు జిల్లా పాడేరు ట్రైబల్ వెల్ఫేర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న వెంకట సన్యాసిశర్మను కదిరి ఆర్డీఓగా నియమించారు. ఇక్కడ పని చేస్తున్న సన్నీవంశీకృష్ణను నెల్లూరు జిల్లా కావలికి బదిలీ చేశారు. ఆయన్ను రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. కొత్త ఆర్డీఓకు స్వాగతం పలికారు.

ఎంపీడీఓలు..: **ముదిగుబ్బ, ధర్మవరం పట్టణం, తాడిమర్రి, బత్తలపల్లి:** ముదిగుబ్బ, ధర్మవరం, తాడిమర్రి, బత్తలపల్లి ఎంపీడీఓలుగా విజయ్‌భాస్కర్, సాయిమనోహర్, రంగారావు, నరసింహనాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. బత్తలపల్లి ఈవోఆర్డీగా క్రిష్టప్ప విధుల్లో చేరారు. వారికి సిబ్బంది, తెదేపా నాయకులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

ఎస్పీని కలసిన ఎక్సైజ్ అధికారులు



ఎస్పీ రత్నకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా ఎస్పీ రత్నను గురువారం ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆశాఖ డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య, అసిస్టెంటు కమిషనర్ మునిస్వామి, సూపరింటెండెంట్ గోవిందనాయక్, ఏఈ ఎస్.నరసింహులు, సీఐ నాగరాజు, ఎస్సై ఉమామనోహర్‌రాజు తదితరులు ఎస్పీకి పుష్పగుచ్ఛం అందించారు.



ధర్మవరం: దుర్గాదేవి అలంకారం



తాడిమర్రి: బాలత్రిపుర సుందరిగా వాసవీమాత



కదిరి: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి మత్స్యావతార దర్శనం



నల్లచెరువులో బాలత్రిపుర సుందరి



కొత్తచెరువు: బాలాత్రిపుర సుందరిగా వాసవీమాత



కదిరిపట్టణం: కంచికామాక్షిగా వాసవాంబ



తలుపుల: పుష్పాలంకరణలో వాసవీమాత

శక్తిస్వరూపిణి.. వరప్రదాయిని



ధర్మవరం: పార్వతిదేవిగా కన్యకాపరమేశ్వరి

పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల్లో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఆలయాలను విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు. అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగన్మాతకు భక్తజనం నీరాజనాలు పలికారు. ఆపదలు రాకుండా చూడు తల్లీ అంటూ ప్రణమిల్లారు.

– న్యూస్‌టుడే బృందం



ఎనుములపల్లి: త్రిపుర సుందరిగా దుర్గామాత



బత్తలపల్లిలో బాలా త్రిపుర సుందరిదేవి అలంకరణ

వ్యవసాయ, విద్యుత్తు పరికరాల అపహరణ

కనగానపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని తూంచెర్ల గ్రామంలో బుధవారం రాత్రి సమయంలో ఏకకాలంలో ముగ్గురు రైతులకు చెందిన వ్యవసాయ, విద్యుత్తు, రసాయన ఎరువులను అపహరించినట్లు బాధిత రైతులు పేర్కొన్నారు. తూంచెర్ల గ్రామానికి చెందిన రైతులు శివారెడ్డి, రమణ, చెంద్రాయుడుల పొలాలు గ్రామానికి సమీప దూరంలో ఉన్నాయి. ప్రతి రైతు పొలంలో ఒక గదిని ఏర్పాటు చేసుకొని అందులో వ్యవసాయ పరికరాలు, విద్యుత్తు పరికరాలు, పంటలకు కావాల్సిన మందులను నిల్వ చేసుకున్నారు. గుర్తు తెలియని దుండగలు గదులకు ఏర్పాటు చేసిన తాళాలను పగలగొట్టి అందులో ఉన్న వస్తువులు, పరికరాలు, రసాయనిక ఎరువులను అపహరించారన్నారు. గురువారం కనగానపల్లి పోలీస్ స్టేషనులో ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతులు తెలిపారు.

వేరుసెనగ పంట దిగుబడి దయనీయం

కనగానపల్లి, న్యూస్‌టుడే: వేరుసెనగ పంట దిగుబడి దయనీయంగా ఉందని మండల వ్యవసాయాధికారిణి కృష్ణకుమారి పేర్కొన్నారు. గురువారం మండలంలోని నెమిళివరం, ఎలకుంట్ల గ్రామాల్లో రైతులు సాగు చేసిన వేరుసెనగ పంటలో రైతులతో కలిసి పంట కోత ప్రయోగాలు చేపట్టారు. వేరుసెనగ పంట సాగు సమయం నుంచి పంట కోతకోసే వరకు సమాయానుకూలంగా వర్షం కురవకపోవడం వల్ల పంట దిగుబడి తగ్గిందన్నారు. పైరు ఎదుగుదల తగ్గడం వల్ల విత్తన కాయి నాణ్యత కోల్పోయిందన్నారు.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

ధర్మవరం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వీకరించిన అర్జీలను వేగంగా పరిష్కరించే విధంగా అధికారులు పని చేయాలని ధర్మవరం ఆర్డీఓ మహేశ్ ఆదేశించారు. గురువారం రెవెన్యూ, వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఏ స్థాయి సమస్యలను ఆస్థాయిలోనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. భూ సమస్యలను క్షేత్రస్థాయి పరిశీలన చేసి పరిష్కారం చూపాలన్నారు. ఆర్డీవో కార్యాలయ ఏవో ఖతిజన్‌కుబ్రా, అధికారులు పాల్గొన్నారు.



ఆర్డీఓను సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేస్తున్న తెదేపా నాయకులు

- ధర్మవరం నియోజకవర్గంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెదేపా నాయకులు ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. తెదేపా పట్టణ అధ్యక్షుడు సుధాకర్, నాయకులు మహేశ్ చౌదరి, విజయసారథి, నాగూర్ హుస్సేన్, శ్రీనివాసులు, షరీఫ్, మాధవరెడ్డి ఆర్డీఓకు పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు.

ప్రమాదంలో చిక్కుకున్న వారిని కాపాడిన పోలీసులు

ఎన్‌ఎస్‌గేట్ (చెన్నేకొత్తపల్లి), న్యూస్‌టుడే: ప్రమాదంలో చిక్కుకున్న వారిని సీకేపల్లి పోలీసులు కాపాడారు. ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం నగరానికి చెందిన సతీష్ తన భార్య భారతి, తల్లి లక్ష్మీదేవి, కుమార్తెతో బుధవారం రాత్రి కారులో బెంగళూరుకు వెళుతున్నారు. ఎన్‌ఎస్‌గేట్ సమీపంలోకి రాగానే కారు రహదారి విభాగినిని ఢీకొని కారు ఆగిపోయింది. అదే సమయంలో భారీ వర్షం కురుస్తుడటంతో కారు బయటికి రాలేకపోయారు. సతీష్ డయల్ 100కు సమాచారం అందించడంతో వారు పెనుకొండ పోలీసులకు సమాచారం అందించారు. అక్కడి నుంచి సీకేపల్లి పోలీసులకు సమాచారం అందడంతో జమేదార్ రమణ, కానిస్టేబుల్ సంజీవరాయుడు ఇద్దరూ సంఘటనా స్థలానికి చేరుకుని కారులోని వారిని జీపులోకి ఎక్కించారు. ఆగిపోయిన కారును అతికష్టం మీద పక్కకు తొలగించారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయక బాధితులను కాపాడిన పోలీస్ సిబ్బంది చొరవను జిల్లా ఎస్పీ రత్న అభినందించినట్లు ఎస్సై వివరించారు.

నిలిచిన సచివాలయాల నిర్మాణం

వసతి గృహం, ఉపకేంద్రంలో నిర్వహణ

అమడగూరు, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీకి సచివాలయ భవనాన్ని నిర్మించాలని నిర్దేశించింది. కానీ, నాటి ప్రభుత్వం సరైన నిబంధనలు పాటించకపోవడంతో క్షేత్రస్థాయిలో పనులు సగంలోనే నిలిచిపోవడంతో ప్రజాధనం రూ.లక్షల్లో నిరుపయోగంగా మారింది. నిర్మాణాలకు సంబంధించి టెండర్ల ప్రక్రియ లేకపోవడం, నాయకులకు పనులు కేటాయించడంతో వారిలో కొంతమంది పనులు చేపట్టారు. మరికొంత మంది కమీషన్‌కు అమ్ముకున్నారు. వీటికితోడు వైకాపా ప్రభుత్వం గుత్తేదారులకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో అప్పులు చేసి పనులు పూర్తి చేసినప్పటికీ బిల్లులు వస్తాయో రావో అన్న అనుమానంతో చేపట్టిన పనులు సగంలోనే ఆపేశారు. అమడగూరు మండలంలోని చినగానిపల్లి, పూలకుంటపల్లి, జౌకలకొత్తపల్లి, చీకిరేవులపల్లి గ్రామాల్లోని సచివాలయాలు అసంపూర్తిగానే ఉండిపోయాయి. ప్రస్తుతం చినగానిపల్లి సచివాలయం ఆరోగ్య ఉపకేంద్రంలోనూ, జౌకలకొత్తపల్లి సచివాలయాన్ని బీసీ వసతి గృహంలోనూ నిర్వహిస్తున్నారు. గుండువారిపల్లిలో పనులు పూర్తి అయినప్పటికీ బిల్లులు చెల్లించకపోవడంతో ప్రారంభానికి నోచుకోలేదు.

నిబంధనల ప్రకారం చర్యలు

గత ప్రభుత్వం నిబంధనల ప్రకారం గుత్తేదారులు పనులు చేశారు. ఆగిపోయిన సచివాలయాలకు సంబంధించి ప్రస్తుత ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకొంటుందో వాటికి అనుగుణంగా పనులు పూర్తి చేయించడానికి చర్యలు తీసుకుంటాం. **- గురురాజ్ గుప్తా, పంచాయతీరాజ్ ఏఈ**



పూలకుంటపల్లిలో అర్ధాంతరంగా ఆగిన సచివాలయ నిర్మాణం

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద గురువారం పుట్టపర్తి ఆర్టీసీ డిపో బస్సు ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న నూతిమడుగు గ్రామానికి చెందిన ఓబుళప్ప, ధర్మవరానికి చెందిన గౌస్‌పీరా, శ్రీదేవి గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానికులు ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో ఆటో అద్దాలు పగిలాయి. ధర్మవరం రెండో పట్టణ పోలీసులు వివరాలు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు

గాండ్లపెంట, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు డ్రైవర్ వాహనాలను క్రాస్ చేస్తూ అతివేగంతో నడిపి బ్రేక్ వేయడంతో కండక్టర్ గాయపడిన ఘటన గత నెల 18న మండల పరిధిలోని ద్వారనాల వద్ద చోటు చేసుకుంది. కండక్టర్ శివప్ప ఫిర్యాదు మేరకు డ్రైవర్ ఈశ్వరనాయక్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ రంగనాయక్ తెలిపారు.

కారు, లారీ ఢీ.. ఇద్దరికి గాయాలు

బత్తలపల్లి: బత్తలపల్లి సమీపంలోని రింగ్‌రోడ్డు మలుపు వద్ద కారు, లారీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పెద్దపప్పూరు మండలం సోమనపల్లి గ్రామానికి చెందిన కోనంకి రామాంజనేయులు, కోనంకి అరుణ్ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కారులో ఇరుక్కున్న ఇద్దరిని బయటకు తీసి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

అదనపు కట్నం వేధింపులపై ఫిర్యాదు

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: అదనపు కట్నం పేరుతో భర్త, అత్తింటివారు వేధిస్తున్నారంటూ కదిరిపట్టణం కంచుకోటకు చెందిన అమీనా పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత సంవత్సరం డిసెంబరులో నిజాంవలికాలనీకి చెందిన సనావుల్లాతో అమీనాకు వివాహమైంది. పెళ్లి సమయంలో కట్నకానుకలు ఇచ్చారు. వీరి కాపురం మూడునెలలు సాఫీగా సాగింది. ఆ తరువాత అదనపుకట్నం పేరుతో భర్త సనావుల్లా, అత్తమామలు భాను, యూసుఫ్‌ఖాన్ శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.